


GST NO: 36ACPPF9587L2ZM
TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక
CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 165 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 ఆదివారం 14 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




# అభివృద్ధి పనులకు రూ.7 వేల కోట్లు

## మణిపూర్‌ను దేశంతో అనుసంధానం చేస్తాం

-దేశానికి మణిహారం మణిపూర్
-రూ.7 వేల కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
-మణిపూర్ అల్లర్ల బాధితులకు పరామర్శ
-శాంతియుత వాతవరణంతోనే అభివృద్ధి సాధ్యం
-రెండేళ్ల తరవాత మణిపూర్‌లో పర్యటించిన ప్రధాని మోడీ
-మోడీ రాకతో భారీగా భద్రతా ఏర్పాట్లు

2 లో





ఉక్రెయిన్‌పై యుద్ధం

# ఆపడానికే

- జి-7 దేశాలపై ట్రంప్ ఒత్తిడి
-భారత్,చైనాలపై టారిఫ్‌ల విధించండి


వాషింగ్టన్,సెప్టెంబర్13(సమయజ్యోతి):

రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై భారీగా టారిఫ్‌లను విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనకు ఐరోపా సమాఖ్యతో పాటు–, జి 7 దేశాలు అంగీకరించినట్లు– తెలుస్తుంది. ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణ చేయాలని, అందుకోసం రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గం అని అందులో భాగంగా రష్యా చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై భారీ టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జి 7 దేశాలు సమావేశమయ్యాయి. ఈ భేటీలో సుంకాల విధింపుపై చర్చ సాగింది. ఈ సందర్భంగా అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ మాట్లాడుతూ ... ఇప్పటికే భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ క్లిష్ట సమయంలో నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి జీ 7 దేశాలు ముందుకురావాలని కోరారు. అందుకు జి 7 దేశాలు స్పందిస్తూ ... యుద్ధం ముగింపునకు కట్టు–బడి ఉన్నామని ప్రకటించాయి. రష్యాపై ఒత్తిడి తేవడానికి ఇంతకుముందు ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈ విషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జి 7 దేశాల ముందుపెట్టడం గమనార్హం.

## మణిపూర్‌లో ఇప్పుడా పర్యటించేది

మోడీ పర్యటనపై ప్రియాంక పెదవివిరుపు

వయనాడ్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):



జాతుల మధ్య ఘర్షణ జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని మోదీ మణిపుర్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పర్యటనపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మణిపుర్‌లో ఘర్షణలు జరిగిన రెండేళ్ల తర్వాత ప్రధాని మోదీ అక్కడ పర్యటనకు వెళ్లడం దురదృష్ట కరమన్నారు. భారత్‌లోని ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదంటూ విమర్శించారు. ప్రమాదాలు, విషాదాలు జరిగినప్పుడు ప్రధానులు వెంటనే అక్కడికి వెళ్తారన్నారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి అందరు ప్రధానులు ఇదే పాటించారని తెలిపారు. కానీ, మోదీ మాత్రం రెండేళ్ల తర్వాత దీన్ని పాటిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఆయన ఇప్పటికే అక్కడ పర్యటించి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఇక, మోదీ పర్యటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్ర విమర్శలు చేశారు. కాగా.. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ఉన్న మోదీ మిజోరం రాజధాని ఆయిజోల్ కేంద్రంగా రూ.8,071 కోట్లతో కొత్తగా నిర్మించిన 51.38 కి.మీ. పొడవైన రైలు కారిడార్‌ను ప్రారంభించారు. ఈ పర్యటన దృష్ట్యా మణిపూర్ ప్రభుత్వం కట్టు–దిట్టమైన భద్రతా ఏర్పాట్లు– చేసింది.



# తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను రాబట్టాల్సిందే

-కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించాల్సిందే-కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించాలి
-న్యాయనిపుణులు, అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటాను సాధించి తీరాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి న్యాయ నిపుణులను, ఇరిగేషన్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణాలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీరు కుడావదులుకునేది లేదని ముఖ్యమంత్రి అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 904 టీ–ఎంసీల నీటి వాటాను సాధించుకునేందుకు పట్టుబట్టాలన్నారు. అందుకు అవసరమైన ఆధారాలన్నీ వెంటనే సిద్ధం చేసి న్యాయ నిపుణులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఢిల్లీలో కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తెలంగాణ తుది వాదనలు వినిపించాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్వయంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఈ విచారణలో పాల్గొంటారని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన వైఖరిపై శనివారం ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రితో పాటు– ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్.వైద్యనాథన్, కేంద్ర జలసంఘం –మాజీ ఛైర్మన్ కె.వోహ్రా, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఇ.ఎన్.సి. అంజద్ హుస్సేన్, సీఎంవో సెక్రెటరీ మాణిక్ రాజ్, ఇరిగేషన్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇంతకాలం కృష్ణా నదీ జలాల్లో జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేసి, మనకు రావాల్సిన ప్రతి నీటి బొట్టును దక్కించుకునేలా సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి న్యాయ నిపుణులకు పలు సూచనలు చేశారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలన్నీ ట్రిబ్యునల్ కు సమర్పించాలని కోరారు. ??ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులు, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందు ఉంచాలని కోరారు.

## తెలంగాణ ఆకాంక్షను చాటిన సకలజనుల సమ్మె

ఆనాటి ఘట్టానికి 14 ఏళ్లు పూర్తి...కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్,సెప్టెంబర్13(సమయజ్యోతి):



తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ఎంత బలంగా ఉందో చాటి చెప్పిన మహోధృత ఉద్యమ రూపం సకల జనుల సమ్మె అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉద్యమ సారథి కేసీఆర్ పిలుపుతో యావత్ తెలంగాణ సమాజం ఒక్కటైందని చెప్పారు. సబ్బండ వర్గాలు ఏకమై 42 రోజులపాటు– శాంతియుతంగా నిరసన తెలిపి, తెలంగాణ సెగను ఢిల్లీకి తాకేలా చేశారన్నారు. ఔర్ ఏక్ ధక్కా..తెలంగాణ పక్కా అని దిక్కులు పిక్కటిల్లేలా తెలంగాణ ప్రజలు నినదించారని గుర్తుచేశారు. సకల జనుల సమ్మెకు శనివారంతో 14 ఏండ్లు పూర్తయిన సందర్భంగా.. సమ్మెలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై ఎందుకు మాట్లాడాలి

కెటిఆర్ విమర్శలపై మండిపడ్డ పిసిసి చీఫ్

హైదరాబాద్,సెప్టెంబర్13(సమయజ్యోతి):



ఓట్ చోరీ గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధారాలతో నిరూపించారని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా దీనిపై ఉద్యమిస్తున్న వేళ రాహుల్‌కు మద్దతు పెరిగిందని అన్నారు. మోడీ ఈ విషయంలో అడ్డంగా దొరికారని అన్నారు. ఓ జాతీయ అంశంపై పోరాటం చేస్తుంటే..బిఆర్ఎస్ ఎమ్మెల్యేల గురించి రాహుల్ ఎందుకు మాట్లాడాని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం సిబిఐకి అప్పజెప్పినా కేంద్రంలో ఎందుకు కదలిక లేదని అన్నారు. ఫార్ములా– ఈ కార్ రేసు కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు జైలు ఖాయం అని అన్నారు. ఢిల్లీలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హరీష్ రావు, కెటిఆర్, నరేంద్ర మోడిని కలిశారని తెలియజేశారు.

మొదటిపేజీ తరువాయి

## ఉక్రెయిన్‌పై యుద్ధం ఆపడానికే

ఇప్పుడు కూడా టారిఫ్‌ల విధింపుపై ఐరోపా సమాఖ్య దేశాల నుంచి భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. ఫలితంగా అది ఇంకా సాధ్యపడలేదు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యా (షశ)పై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తోంది. అందులో భాగంగా ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని చూస్తోంది. ఈక్రమంలో ఈయూ, జీ7 దేశాలు భారత్, చైనాలపై టారిఫ్‌లు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు జీ7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్లు- తెలుస్తోంది. ఇప్పటికే.. భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని అక్కడ ప్రస్తావించారు. ఈసందర్భంగా యుద్ధం ముగింపునకు కట్టుబడి ఉన్నామంటూ జీ7 సభ్యదేశాలు అమెరికాకు హామీ ఇచ్చాయి. దీంతో భారత్, చైనాలపై సుంకాల విధింపునకు ఆయా దేశాలు కూడా సిద్ధమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. కాగా.. రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఇంతకుముందు ఐరోపా సమాఖ్య దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈవిషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జీ7 దేశాల ముందుపెట్టడం గమనార్హం.

మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ ఆకాంక్షను చాటిన సకలజనుల సమ్మె

తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ఎంత బలంగా ఉందో చాటి చెప్పిన మహోద్ధృత ఉద్యమ రూపం సకల జనుల సమ్మె. సబ్బండ వర్గాల ప్రజలు ఏకమై, 42 రోజుల పాటు- శాంతియుతంగా నిరసన తెలిపి, తెలంగాణ సెగను ఢిల్లీకి తాకేలా చేసిన మహోన్నత ఘట్టం సకల జనుల సమ్మె. సెప్టెంబర్ 12, 2011 రోజున కరీంనగర్ జనగర్జనలో ఉద్యమ సారథి కేసీఆర్ పిలుపు మేరకు యావత్ తెలంగాణ సమాజం ఒక్కటయ్యింది. సమ్మెలో స్వచ్ఛంధంగా భాగ స్వాములయ్యి, ఔర్ ఏక్ ధక్కా.. తెలంగాణ పక్కా అని దిక్కులు పిక్కటిల్లెలా తెలంగాణ ప్రజలు నినదించారు. నిర్బంధాలను ఛేదించి, ఆంక్షలకు ఎదురొడ్డి, బెదిరింపులను లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ బిడ్డలు పోరాడారు. సకల జనుల సమ్మెకు నేటితో 14 ఏళ్ళు నిండిన సందర్భంగా.. సమ్మెలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## సాకారానికి నిధిని ఏర్పాటుచేయండి

### మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సుప్రీం ధర్మాసనం సూచన

న్యూఢిల్లీ,సెప్టెంబరు13 (సమయజ్యోతి):



పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది సొంతింటి కలలు సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అటువంటి వాటిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి' ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. నివాస ప్రాజెక్టు విషయంలో ఓ వివాదానికి సంబంధించిన పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. రియల్ డెవలపర్ల చేతిలో గృహ కొనుగోలుదారులు మోసపోకుండా లేదా దోపిడీకి గురికాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేందుకు ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి,

## గ్రూప్-1పై అప్పీల్‌కు వెళ్లాలనుకోవడం దుర్మార్గం హరీష్ రావు

హైదరాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

గ్రూప్-1 పరీక్షలపై హైకోర్టు తీర్పును సుప్రీంలో సవాల్ చేయాలనుకోవడం దుర్మార్గమని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పోస్టులకు మంత్రులు, అధి కారులు రూ. లక్షలు లంచం అడి గారని చెబుతున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. గ్రూప్-1 పోస్టులకు రూ. లక్షల లంచం తీసుకున్నట్లు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పుపై అప్పీల్ కు వెళ్లాలను కోవడం సిగ్గు చేటు- అని తప్పుదిద్దు కోకుండా అప్పీల్ కి వెళ్లాలనుకోవడం సరికాదని విమర్శించారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగుల పక్షాన బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని, అసెంబ్లీలో నిలదీసి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హరీష్ రావు హామీ ఇచ్చారు.



# అభివృద్ధి పనులకు రూ.7 వేల కోట్లు

మొదటిపేజీ తరువాయి

ఇంఫాల్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

మణిపుర్ పేరులోనే మణి ఉందని అది దేశానికే మణి వంటిదని, మణిపుర్ దేశానికి ప్రకృతి ఇచ్చిన బహుమతి అని ప్రధాని మోడీ కొనియాడారు. మణిపుర్ ను వేగంగా ప్రగతి పథంలో పయనింపజేస్తాం అని మణిపుర్ కోసం రూ.7 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. మణిపుర్‌ను దేశంతో అనుసంధానం చేసే ప్రాజెక్టులు చేపడుతున్నామని, రైలు, రోడ్డు మార్గాల కోసం మణిపుర్ కు నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. భారీ వర్షాల వల్ల హెలికాప్టర్ లో రావడం సాధ్యపడలేదని నరేంద్ర మోడీ తెలిపారు. రోడ్డు మార్గంలో మణిపుర్ కు వచ్చానని అన్నారు. చాలాకాం తరవాత మణిపుర్ లో మోడీ పర్యటించారు. మణిపుర్ లో అల్లర్ల బాధితులను పరామర్శించారు. ఇంపాల్, చురాచంద్ పుర్ లో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మణిపుర్ లో అల్లర్ల బాధిత కుటుంబాల చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మణిపుర్ బహిరంగ సభలో మాట్లాడారు. రోడ్డు మార్గంలో వచ్చేటప్పుడు తనకు తమరు పలికిన స్వాగతం మర్చిపోలేనని, మువ్వెన్నల జెండాలు చేతబట్టి తనకు ఘనంగా స్వాగతం పలికారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రూ. 8 వేల కోట్లతో జాతీయ రహదారుల పనులు వేగంగా కొనసాగు తున్నాయని, మణిపుర్ లో రైల్ కనెక్టివిటీ- భారీగా పెంచుతున్నామని మోడి పేర్కొన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించ బోతుందని చెప్పారు. ప్రస్తుతం మణిపుర్ చేపడుతున్న ప్రాజెక్టులతో మౌలిక సదుపా యాలు, వైద్యసేవలు మెరుగవుతాయని, ఈశాన్య రాష్ట్రాల్లో దశా బ్దాలుగా అనేక వివాదాలు, ఉద్య మాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొంటోందని, శాంతి స్థాపన ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. శాంతి స్థాపన ద్వారా తమ భావితరాల భవిష్యత్తు బావుంటుదని, మణిపుర్ ప్రజల వెంట భారత ప్రభుత్వం ఉందని మోడి స్పష్టం చేశారు. జాతుల మధ్య ఘర్షణలకు కేంద్రమైన చురాచంద్‌పుర్ జిల్లాకు చేరుకున్నారు. అక్కడ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. హింసాత్మక ఘటనల వల్ల నిరాశ్రయులైన వారితో మాట్లాడారు. 2023లో ఈ ఘర్షణలు చోటుచేసుకోగా.. రెండేళ్ల తర్వాత మోడీ ఆ రాష్ట్రానికి వెళ్లారు. శరణార్థి శిబిరాల్లో ఉన్న చిన్నారులను పలకరించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఓ చిన్నారి కానుకగా ఇచ్చింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని వారికి హామీ ఇచ్చారు. తర్వాత స్థానికంగా ఏర్పాటు-చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. 'మణిపుర్ ప్రకృతి ప్రసాదించిన కానుక. ఈ రాష్ట్ర ప్రజలకు తలవంచి నమస్కరిస్తున్నాను. ఇది సాహసవంతులు పుట్టిన నేల. మణిపుర్ లో కొండలు చాలా అందంగా ఉన్నాయి. పేరులో ఉన్న మణికి అర్థం.. ఈశాన్య రత్నమని. ఈ రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తాం. ఇలాంటి అందమైన ప్రాంతంలో హింస చెలరేగింది. కొత్త ఉషస్సు ప్రారంభం కానుంది. ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకున్నారు. శాంతి చర్చలు మొదలయ్యాయి. నేను మీతో ఉన్నాను. కేంద్రం మీ వెంటే ఉంటు-ందని హామీ ఇస్తున్నాను. ఈ రాష్ట్రం శాంతికి చిహ్నంగా మారాలని కోరుకుంటున్నాను అని మోదీ అన్నారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా సభకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. మెయిటీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనపై వచ్చిన వ్యతిరేకత 2023లో మణిపుర్‌ను హింసాత్మకంగా మార్చిన సంగతి తెలిసిందే. వారికి రిజర్వేషన్లు ఇవ్వొద్దని ఆదివాసీ తెగలు డిమాండ్ చేశాయి. మెయిటీ-లకు రిజర్వేషన్లు దక్కితే వారు తమ అటవీ ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పాటు- చేసుకోవడంతో పాటు- తమకు రావాల్సిన ఉద్యోగాల్లో వాటా తగ్గిపోతుందని వారు ఆందోళన చెందారు. ఆ నిరసనలకు చురాచంద్‌పుర్






కేంద్రమైంది. రాష్ట్రంలోని పలు అటవీ ప్రాంతాలను రిజర్వ్ ప్రాంతాలుగా ప్రకటించడంతో కొండలపై నివాసమున్న వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం పునరావాసం కల్పించ కుండా తమను తరలించడంపై నిరసన వ్యక్తంచేశారు. దీనికితోడు రిజర్వేషన్ల అంశం తెర పైకి రావడంతో నిరసనలు ఘర్షణ రూపం దాల్చాయి. ఆ క్రమంలో అమానవీయ ఘటనలు చోటుచేసు కున్నాయి. మణిపుర్‌లో చెలరేగిన అల్లర్లలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా కొన్ని వేల మంది నిరాశ్రయు లయ్యారు. పలువురి ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ హింసపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న బీరెన్‌సింగ్ ఈ ఏడాది తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత శనివారం వెళ్లారు. ఈ పర్యటన దృష్ట్యా మణిపుర్ ప్రభుత్వం కట్టు-దిట్టమైన భద్రతా ఏర్పాట్లు- చేసింది. మిజోరం, మణిపుర్, అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో మోదీ పర్యటన సాగనుంది.

# తెలంగాణకు 904 టీఎంసీల నీటి వాటాను రాబట్టాల్సిందే

ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన జీవోలు, మెమోలు, డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఉ[illegible] వివరాలన్నీ [illegible]ల్కు అందించాలని చెప్పారు. గత ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన నీటి వాటాలను సాధించకపోగా ఏపీకీ 512 టీ-ఎంసీలు కట్టబెట్టి, 299 టీ-ఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 299 టీ-ఎంసీల వాటాకు ఒప్పుకున్న విషయాన్ని ఏపీ ఇప్పుడు ట్రిబ్యునల్ ముందుకు తెచ్చిందని న్యాయ నిపుణులు సీఎంకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతో వ్యవహరించటంతో ఈ పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. గడిచిన పదేండ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయపరంగా రావాల్సిన నీటి కోటా సాధించటంలో దారుణంగా విఫలమైందన్నారు. కృష్ణాపై తలపెట్టిన పాలమూరు నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్లో పెట్టిందన్నారు. నీటి వాటాల విషయంలో తీరని ద్రోహం చేసిందన్నారు. దిగువ రాష్ట్రాల హక్కులతో పాటు- నదీ వాటాల పంపిణీ న్యాయ సూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణాలో 904 టీ-ఎంసీల నీటి వాటా రావాల్సి ఉందని, అందుకు అనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించటంతో ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకు పోయిందని, ఆ విషయాన్ని ట్రిబ్యునల్ ముందుకు తీసుకురావాలని సీఎం చెప్పారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండకముందే, పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా రోజుకు పది టీ-ఎంసీల నీటిని ఏపీ మళ్లిస్తుందని, ఇతర బేసిన్లకు తరలించుకుపోతోందని అన్నారు. ఎక్కడపడితే అక్కడ కాల్వల సామర్థం పెంచుకోవటంతో పాటు- పట్టిసీమ, పులిచింతల, చింతలపాడు వరకు ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న అంశాలన్నీ ఆధారాలతో సహా ట్రిబ్యునల్కు నివేదించాలని, అందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా నీటిని ఏపీ అక్రమంగా మళ్లించటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ తో పాటు- పులిచింతల వద్ద ఉన్న జల విద్యుత్తు ప్రాజెక్టులు మూత పడే ప్రమాదం ముంచుకు వచ్చిందన్నారు. తక్కువ ఖర్చుతో ఉత్పత్తయ్యే జల విద్యుత్తు ఉత్పత్తికి విఘాతం కలుగుతోందన్నారు. ఈ విషయాలన్నీ ట్రిబ్యునల్ ఎదుట వాదనలుగా వినిపించాలని సీఎం ఆదేశించారు. కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం కావటంతో తెలంగాణకు రావాల్సిన హక్కులు, నీటి వాటాలను సాధించుకునేందుకు అన్ని అర్హతలున్నాయని సీఎం అన్నారు. సాగునీటి, తాగునీటి అవసరాలతో పాటు- మెట్ట ప్రాంతం, కరువు ప్రాంతమైన ఉమ్మడి మహబూబ్నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప గత్యంతరం లేదనే విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఇప్పటి వరకు తెలంగాణా ప్రాంతంలో తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయక పోవడం వల్లనే కృష్ణా జలాశయాలను తెలంగాణా వినియోగించుకోలేకపోయిందని గుర్తు చేయాలన్నారు. తెలంగాణ తరఫున వాదనలను వినిపించేందుకు ఇదే సరైన అవకాశమని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంతో పాటు-, కృష్ణా నదీ జలాల్లో రావాల్సిన వాటాల భవిష్యత్తును దిశానిర్దేశర చేసే వాదనలు కావటంతో ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో జారవిడుచుకోవద్దని సీఎం న్యాయ నిపుణులకు సూచించారు.

# పితృపక్షాల్లో తర్పణాలు వదలాలి

### (ఆధ్యాత్మిక చింతన )

తిరుపతి,సెప్టెంబర్13(సమయజ్యోతి)

: పితృ దోషం ఉంటే ఏ పని చేసినా కలసి రాదు.. ఆరోగ్య సమస్యలు.. ఆర్థిక సమస్యలు.. అన్ని రకాలుగా ఇబ్బందులు వేధిస్తూ ఉంటాయి. పితృదోషం నివారణకు మహాలయ పక్షాల్లోకొన్ని పద్దతులను పాటించాలని పండితులు చెబుతున్నారు. తించిన మనపూర్వీకులకు ఏటా తర్పణాలు వదలాల్సి ఉంటుంది. వారుచనిపోయినతిథి ఆధారంగా ఏటా తద్దినం లాంటిది పెట్టాలి. అలా చేయనిపక్షంలో పితృపక్షాల్లో అయినా తర్పణాలు వదలాలి. ప్రస్తుతం పితృ పక్షం.. మహాలయ పక్షాలు కొనసాగుతున్నాయి. పితృ దేవతలను అర్చించేందుకు.. వారి ఆశీస్సులు లను పొందేందుకు .. పితృ దేవతలు ఈ నెల 21 వ తేది వరకు అంటే బాద్రపదమాసం అమావాస్య వరకు భూమిపై సంచరిస్తారని ఓ నమ్మిక. బాద్రపదమాసం చివరి 15 రోజులు అంటే కృష్ణ పక్షంలో పితృదేవతలను సంతృప్తి పరచాలని పండితులు చెబుతున్నారు. పూర్వీకులు అసంతృప్తితో ఉంటే వారి వారసులు అనేక ఇబ్బందులు పడతారని, ఆర్థిక సంక్షోభం.. ఆరోగ్య సమస్యలు కలుగుతాయని చెబుతున్నారు పండితులు. పూర్వీకులను సంతృప్తి చెందితే.. ఈతి భాధలు.. ఆర్థిక బాధల నుంచి.. ఆర్థిక బాధల నుంచి విముక్తి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఒక్కోసారి .. పూర్వీకులకు ఆబ్దికాలు నిర్వహించడం సాధ్యపడకపోవచ్చు. అలాంటి సమయంలో వారి ఆకలి తీరక వారసులకు శాపం పెడతారు. అలాంటి వారు పితృ పక్షాల్లో అంటే బాద్రపద మాసం కృష్ణ పక్షంలో పూర్వీకులకు శ్రాద్ధం.. పిండ ప్రదానం.. తర్పణాలు వదలాలని పండితులు చెబుతున్నారు. అలాకాని పక్షంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటారు. ఎంత సంపాదించినా చేతిలో చిల్లిగవ్వ ఉండదు. ఎప్పుడూ ఏదో అనవసరమైన తప్పని ఖర్చులు వెంటాడుతుంటాయి. అప్పులు పెరగుతాయి. అంతే కాదు వివాహం విషయంలో చాలా సమస్యలు వెంటాడుతాయి. సంబంధాలు నిశ్చయమైనట్లే అయి ఆగిపోతాయి. ప్రతి విషయంలో ఉద్రిక్త పరిస్థితులు ఉంటాయి. కొంతమంది ఎప్పుడూ అనారోగ్యానికి గురవుతుంటారు. దీర్ఘకాలిక రోగాలు వేధిస్తుంటాయి. ఏ విషయంపై శ్రద్ద పెట్టలేకపోతారు. ప్రతి పని విషయంలో కూడా ఆటంకాలు ఏర్పడుతాయి. ఇలాంటి సంకేతాలు జీవితంలో తరచూ సంభవిస్తుంటే.. అలాంటి వారికి పూర్వీకుల శాపం ఉందని పండితులు చెబుతున్నారు. పూర్వీకులు మరణించిన తిథి రోజు కచ్చితంగా శ్రాద్ధ కర్మలు నిర్వహించాలి. పితృపక్షాలసమయంలో పెద్దలకు..ఆహారం.. నీరు..నువ్వులతో .. తర్పణాలు వదలాలి. పూర్వీకులను అర్చించాలి. బ్రాహ్మణులకు స్వయం పాకం .. దక్షిణ.. వస్త్రదానం చేయాలి. పేదలకు, పేదలకు ఆహారం, బట్టలు, ధాన్యాలు, డబ్బు.. దానం చేయాలి. ఇలా చేయడం వలన పూర్వీకుల ఆత్మ శాంతించి సౌఖ్యం లభిస్తుందని పురాణోక్తి.

# పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే..
# చట్ట ప్రకారం చర్య తీసుకుంటాం

## రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షకిల్ పాష

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో

గత కొన్ని రోజులుగా వార్తాపత్రికల్లో, సోషల్ మీడియాలో పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఎండి సైకిల్ పాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.గత ఆగస్టు 14న రాత్రి 7:30 గంటలకు ఆర్మూర్ యాసీన్ హోటల్ వద్ద ఫేస్బుక్ లైవ్ ద్వారా స్థానిక స్టేషను అధికారిని మా హోటల్ ఎందుకు బంద్ చేస్తున్నారని, పింకు బుక్కు లో మీ పేరు ఎక్కిస్తానని మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ సంగతి చూస్తామని మాజీ శాసనసభ్యులు జీవన్ రెడ్డి తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా రాత్రి సుమారు 10 గంటల సమయంలో అన్ని ఎస్టాబ్లిష్మెంట్ లు బంద్ చేయిస్తున్నాము అందులో భాగంగానే పైన తెలిపిన హోటల్ బంద్ చేయడం జరిగింది. మేము మా పోలీసులు చట్టపరంగా ఎలాంటి పక్షపాతం లేకుండా అన్ని ఎస్టాబ్లిష్మెంట్ లను బంద్ చేయించడం జరిగింది. అంతేకానీ దీనిపై మీరు, పోలీసుల యొక్క ఆత్మస్థైర్యం దెబ్బతీసే విధంగా పోలీస్ విధులను నీరు కార్చే విధంగా వ్యవహరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆగస్టు నెల 27 నుండి సెప్టెంబర్ నెల 8వ తారీకు వరకు వినాయక విగ్రహ చవితి ప్రతిష్టపన నుండి నిమజ్జనం వరకు పోలీసులు విధి నిర్వహణలో శాంతి భద్రత పరిరక్షణ భాగంగా ఎలాంటి చిన్న సంఘటనలు జరగకుండా రాత్రింబవళ్లు చూసుకోవడం జరిగింది. సుప్రీంకోర్టు తెలిపిన నిబంధనల ప్రకారం డిజె యొక్క హై వాల్యూం స్పీకర్ నిషేధించడం జరిగింది. కానీ మీరు పోలీసుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా మీరెవరు డీజే సౌండ్ ను పై ఆంక్షలు విధిస్తున్నారని అన్నారు. మేము డీజే సౌండ్ ఆంక్షలు అతిక్రమించిన వారిపై మేము కేసులు నమోదు చేయడం జరిగింది. అది కూడా విధి నిర్వహణలో భాగంగానే కానీ, మీరు మా పోలీసులను టార్గెట్ చేస్తూ మా వారిపై తప్పుడు కేసులు పెట్టడం జరిగిందని ప్రచారం చేస్తున్నారు. దీనివల్ల మా పోలీసుల మనోధైర్యం దెబ్బతినే విధంగా మీ వాక్యాలు వున్నాయి. మీరు ఒక సీనియర్ రాజకీయనాయకుడు అయ్యుండి పోలీసు వారి మీద మరియు వారి మనో ధైర్యాన్ని దెబ్బతీసే విధంగా చేసిన వాక్యాలు పై పోలీస్ అధికారుల సంఘం తరపున ఖండించడం అయినది. ఇంకొకసారి ఇలాంటి వాక్యాలు చేయకూడదని మేము పోలీస్ సంఘం తరపున విన్నవించడం జరుగుతుంది. ఒకవేళ మీరు మళ్లీ ఇదే విదంగా వ్యవహరించినచో మేము అనగా పోలీస్ సంఘం తరపున చట్టప్రకారంగా చర్యలకు మీపై, చట్టపరమైన చర్యలు తీసుకో బడుతుందని వెల్లడించారు.

# ఫోర్జరీ సంతకాలతో నకిలీ షూరిటీలు తయారు చేసిన కేసులో 8 మంది నిందితులు అరెస్ట్.

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## నకిలీ డాక్యుమెంట్లతో కోర్టును సైతం మోసం చేసిన నిందితులు.

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :






తలమడుగు మండలం కోత్తూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరవేని రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదిలాబాద్ 2టౌన్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 498/2025, యు/సెక్షన్ 318(4), 335, 337, 338, 336(2), 340, 257 %తీ/షి% 3(5) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేయబడింది.నిందితులు: ఏ1)కాటిపెల్లి అభిలాష్ రెడ్డి,తండ్రి సూరి బాబు,తలమడుగు మండలంలోని కొత్తూర్ గ్రామం,ఆదిలాబాద్(అరెస్ట్),ఏ2) సయ్యద్ ఇర్ఫాన్(24),తండ్రి సయ్యద్ మహబూబ్, నివాసం ఖుర్షిద్‌నగర్ కాలనీ,ఆదిలాబాద్. (అరెస్ట్), ఏ3) గంటి సత్తెన్న(55),తండ్రి సత్తెన్న,కులం మాలా,నివాసం కొత్తూర్ గ్రామం, తలమడుగు మండలం, ఆదిలాబాద్. (అరెస్ట్),ఏ4) మద్దెల అశోక్(33),తండ్రి నడిపి రాములు, నివాసం కొత్తూర్ గ్రామం, తలమడుగు మండలం, అదిలాబాద్. (అరెస్ట్), ఏ5) రామిరెడ్డి అలియాస్ ప్రమేశ్ రెడ్డి,నివాసం కొత్తూర్ గ్రామం(అరెస్ట్),ఏ6) గడుగు సురేష్, నివాసం: కొతూర్ గ్రామం (పరారీ),ఏ7) ఉల్లెంగలువ భూమన్న, నివాసం కొత్తూర్ గ్రామం (పరారీ), ఏ8) బోర్కర్ రాజు,నివాసం కొత్తూర్ గ్రామం (పరారీ), ఏ9) కోకటాయ్ అశోక్, నివాసం కొత్తూర్ గ్రామం (అరెస్ట్), ఏ10) బోర్కర్ శ్రీనివాస్,నివాసం కొత్తూర్ గ్రామం (పరారీ), ఏ11)సద్దాం,నివాసం మహా లక్ష్మివాడ, ఆదిలాబాద్ (పరారీ), ఏ12) షాహీద్,నివాసం క్రాంతినగర్, ఆది లాబాద్. (అరెస్ట్), ఏ13)ముషీర్, నివాసం ఖుర్షిద్‌నగర్,ఆదిలాబాద్(పరారీ), ఏ14) షాహీల్,నివాసం క్రాంతినగర్, ఆది లాబాద్ (పరారీ), ఏ15) ఖలీమ్, నివాసం వడ్డర కాలనీ, ఆదిలాబాద్ (పరారీ), ఏ16)జంటి,నివాసం రణదేవినగర్, ఆదిలాబాద్ (పరారీ), ఏ17)ఎండి అమీర్ తండ్రి ఎండి ఇక్బాల్, శాంతినగర్(అరెస్ట్).ఫిర్యాదు వివరాల ప్రకారం అభిలాష్ రెడ్డి (కారోబార్), సయ్యద్ ఇర్ఫాన్ (బ్రోకర్) అనే వ్యక్తులు పంచాయతీ కార్యదర్శి సంతకాలను నకిలీగా సృష్టించి,నకిలీ గృహ విలువ పత్రాలు,పన్ను రసీదులు తయారు చేసి కోర్టులో నేరస్తులకు బెయిల్ కోసం,కోర్టు నుండి జప్తు చేయబడిన ప్రాపర్టీల రిలీజ్ కోసం ష్యూరిటీ పత్రాలుగా సమర్పించినట్లు తేలింది.ఈ చర్యలో గంటి సత్తెన్న,మద్దెల అశోక్ ల పేర్లను ఉపయోగించి న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం జరిగింది.ఈ సంఘటనపై శనివారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మీడియా ముఖంగా స్పందిస్తూ ప్రభుత్వ పత్రాలను నకిలీ చేయడం,కోర్టును తప్పుదారి పట్టించే చర్యలు తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని స్పష్టం చేశారు.ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని హెచ్చరించారు.నకిలీ పత్రాలను చేసే వారు,వాటిని ఉపయోగించి న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే వారు ఎవరైనా కఠినమైన శిక్షలకు గురవుతారని స్పష్టం చేశారు.ప్రజలు ఇలాంటి నకిలీ పనులపై అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కేసు నందు బ్రోకరు,కారోబార్ ఇద్దరు కలిసి వారి లబ్ధి స్వలాభం కై నకిలీ షూరిటీ పత్రాలను పంచాయతీ సెక్రటరీ పేరుపై తీసుకొని వాటిని ఉపయోగించి కోర్టు నందు నిందితులకు షూరిటీలుగా ఇచ్చి,కోర్టు ఉత్తర్వుల ద్వారా జైలు నుండి బయటకు రావడం లాంటి చర్యలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా కోర్ట్ నందు పంచాయతీ సెక్రెటరీ ధ్రువీకరించినట్టుగా ఉండేటువంటి నకిలీ ఆస్తి పత్రాలను షూరిటీలుగా చూపిస్తూ,వాహనాలను సెల్ఫోన్లను కొన్ని ప్రాపర్టీలను రిలీజ్ చేయడం జరిగిందని తెలిపారు.జిల్లా ఎస్పీ ప్రభుత్వ అధికారులకు సూచనలు చేస్తూ తెలియని వారికి,పెద్ద పెద్ద నేరాలు చేసే వారికి,బ్రోకర్ల ద్వారా వచ్చే వారికి షూరిటీలు ఇచ్చి మోసపోకుండా ఉండాలని,మీరూ షురూటి ఇచిన నిందితులు పారిపోయినట్లయితే మీనుండి డబ్బులను,ఆస్తిపత్రాలను జప్తు చేయబడుతాయని,కట్టని యెడల ఆస్తుల స్వాధీనం లేదా చట్ట పరమైన చర్యలు ఉంటాయని సూచించారు.ఈ ఘటన నందు నకిలీ షూరిటీ ల ద్వారా లబ్ధి పొందిన నిందితులపై కూడా కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఈ మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి,టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ కాంప్లెక్స్ లోకి మెయిన్ డోర్(ముఖ ద్వారం) ద్వారా అధికారులకు,ప్రజలకు ప్రవేశం రద్దు.

## జిల్లా కలెక్టర్ రాజార్షి షా

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ భవనం 11.09.2025న భారీ వర్షాల కారణంగా పాక్షికంగా కూలిపోయిన విషయం అందరికీ తెలుసు.కలెక్టరేట్‌లో శిథిలాలు మరియు కూలిపోయిన భాగం పడి ఉన్నందున,ప్రజల ప్రాణాలకు మరియు భద్రతకు ముప్పు కలిగించే ఎటువంటి సంఘటనలు జరగకుండా నిరోధించడానికి ఈ హెచ్చరిక జారీ చేయబడుతోందని శనివారం ఓ ప్రకటనలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలియజేశారు.అధికారిక కార్యాక్రమాలకు అంటే సీపీఓ కార్యాలయం,డీసీఓ కార్యాలయం,కలెక్టర్ సమావేశ మందిరం,ఎస్బిఐ బ్యాంకు వైపు నుండి ట్రెజరీ కార్యాలయానికి ప్రవేశం మరియు వెనుక వైపు నుండి అంటే ప్రక్కనే ఉన్న రాంప్ ద్వారా డీపీఆర్ఓ కార్యాలయం మరియు ఆధార్ కేంద్రానికి ప్రవేశం మాత్రమే అనుమతించబడుతుందన్నారు.అందువలన అధికారులు మరియు ప్రజలు పోర్టికో/మెయిన్ డోర్ ద్వారా కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించవద్దని అభ్యర్థించబడిందని తెలిపారు.తాత్కాలిక ప్రాతిపదికన,కలెక్టరేట్ లోపలికి-బయటికి విభాగాలు డీపీఆర్ఓ కార్యాలయంలో పనిచేస్తాయన్నారు.ఈ విషయంలో అధికారులు మరియు ప్రజలు సూచనలను పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.



# యూరియా పై అనవసర రాద్ధాంతం వద్దు,రైతులు విపక్షాల మాటలు నమ్మొద్దు.

## డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

యూరియాపై అవసర రాద్ధాంతం చేయొద్దని,రైతులు విపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందొద్దని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆదిలాబాద్ జిల్లాలో యూరియా కొరత లేదని,విపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు.యూరియా కొరత ఒక్క తెలంగాణలోనే లేదని కేంద్ర ప్రభుత్వ అసమర్ధత వల్ల దాదాపు 18 రాష్ట్రాల్లో రైతులు యూరియా కోసం కష్టాలు పడాల్సి వస్తోందని ఆయన అన్నారు.తాజాగా తెలంగాణకు 23వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు.ఎనిమిది రోజుల్లో మరో 27వేల మెట్రిక్ టన్నులు వస్తుందన్నారు.దీంతో రైతులు యూరియా కోసం తిప్పలు పడే అవస్థ ఉండదన్నారు.కలెక్టరేట్ భవనం కూలిన ఘటనను బీఆర్ఎస్ రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.అసలు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి అభివృద్ధిని పూర్తిగా నాశనం చేసిందే ఆ పార్టీ అన్నారు.కమీషన్ల కోసం బిల్లులు ఆపడం వల్లే నూతన కలెక్టరేట్ పూర్తి కాలేదనడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.గుత్తేదారుకు 12కోట్ల బిల్లుల చెల్లింపు పూర్తయిందన్నారు.భవనం కూలిన ఘటనపై మంత్రి జూపల్లి సమీక్షలో ఆరా తీసి నూతన భవనం గురించి వాకబు చేశారని,ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు నోరు అదుపులో పెట్టుకుంటే బాగుంటుందని హితవు పలికారు.అనేక సంక్షేమ పథకాలతో ప్రజా పాలన సాగిస్తున్న ప్రభుత్వం పై బీఆర్ఎస్,బీజేపీ కావాలనే బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు.ఇందిరమ్మ ఇండ్లను బీజేపీ తమవిగా చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు.కేవలం స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం పై అనవసర విమర్శలు చేస్తున్నారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.ఈ మీడియా సమావేశంలో సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,మాజీ మున్సిపల్ చైర్మన్ బాదం గంగన్న,మునిగెల నర్సింగ్,లోక ప్రవీణ్ రెడ్డి,ముహమ్మద్ రఫీక్,ఎమ్ ఏ షకీల్,అశోక్,రామ్ రెడ్డి,దేరా కృష్ణారెడ్డి,దొగ్గలి రాజేశ్వర్,మొయిన్ అహ్మద్,సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య 71వ జన్మదిన వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో శనివారము బిసిటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీల ఆశాజ్యోతి పోరాటయోధుడు, సంక్షేమ హాస్టల్ బీసీ స్కాలర్షిప్, నిరుద్యోగుల సంక్షేమం కోసం అవిశ్రాంత పోరాటం చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బిసిటిఏ రాష్ట్ర కార్యదర్శి బండారి మల్లేశం, బీసి యువజన సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాల సురేష్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిగురు వెంకన్న ముదిరాజ్, నాయకులు కదిరే పరశురాములు, నర్సింలు, రాజలింగం పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల వారోత్సవాలు

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో శనివారం సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల వారోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ తన్నీరు గోపాలరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటం వల్ల లక్షలాది ఎకరాల భూములు పేదలపరం అయ్యాయని అన్నారు. తెలంగాణ సాయుధ రైతంగా పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి వైఖరిని తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య లాంటి కమ్యూనిస్టుల అమరత్వంతో ప్రజలు సాయుధ పోరాటాన్ని ఉధృతం చేశారు. పోరాటంలో అమరులు తెలంగాణ సాయుధ పోరాట సేనాని కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి, తెలంగాణలో నైజాం సర్కార్ పోలీసులసే హత్య చేయబడ్డ కామ్రేడ్ సింగిరెడ్డి భూపతిరెడ్డిల కాంస్య విగ్రహాలను సిరిసిల్ల పట్టణం నడిబొడ్డులో ఏర్పాటు చేయాలని అన్నారు. సీనియర్ నాయకులు మిద్దె నరసన్న, మండల నాయకులు అనమేని బూదన్న, వీరయ్య, చంద్రం, శంకర్, బాలరాజు, ఆనంద్, రాజేందర్ శీను, శంకర్, రాయమల్లు కుమార్, కిరణ్ కిషన్, చందు, చిన్న నాని పాల్గొన్నారు.



# శ్రీ వెంకటేశ్వర ,మదర్ తెరిసా ఉపాధ్యాయ బృందానికి సన్మానం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

గురుపూజోత్సవం ను పురస్కరించుకొని బడ్జెట్ స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ తెలంగాణ అసోసియేషన్ ఆర్మూర్ డివిజన్ ఆధ్వర్యంలో శనివారం మోర్తాడ్ లో ఘనంగా గురుపూజోత్సవం వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో బాల్కొండ కి చెందిన మదర్ తెరిసా, శ్రీ వేంకటేశ్వర కరస్పాండెంట్ల్ కే రామలక్ష్మి, నరసింహారెడ్డిలతోపాటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు హైమద్, కిషన్, ఝాన్సీ, పద్మజలకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శాలువతో సన్మానించి బెస్ట్ టీచర్ జ్ఞాపికలను బహుకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# విమోచన అంటే ఉలికిపాటు ఎందుకో?

తెలంగాణ విమోచన అనగానే పాలకులు ఉలిక్కిపడుతున్నారు. ఏదో పేరు పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా జరుపుకోవడానికి జడుస్తున్న నేతలు ఉన్నందుకు మనం సిగ్గుపడాలి. బాజాప్తా ఎందుకు విమోచన జరపలేక పోయారో తగ పాలకులు, నేటి పాలకులు సమాధానం ఇచ్చుకోవాలి. నిజాం నిరంకుశాలను, రజాకార్ల ఆగడాలను ఎదరించ డానికి జరిగిన పోరాటం ముమ్మాటికి తిరుగ బాటు చరిత్రే అవుతుంది. చైనా,రష్యాల్లో జరిగిన పోరాటలకు ఇది తక్కువేం కాదు. అయినంత మాత్రాన విమోచన దినోత్సవంజరపరాదని అన్నవాళ్లు మూర్ఖులు కాక మరోటి కాదు. దీనిని విస్మరించేలా చేయడం పాలకులకు మంచిది కాదు. ఖాసింరజ్వీ ఘాతుకాలకు అంతులేని చరిత్ర ఉంది. అదంతా చదువుతుంటే రక్తం మరిగిపోతుంది. నిజాం గురించి, ఆ పాలన గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. విముక్త తెలంగాణ జరిగిన సెప్టెంబర్17న విమోచన ఉత్సవాలు జరుపుకోవాలన్న ఆకాంక్షలను గత ప్రభుత్వాలతో పాటు, తెలంగాణ ప్రభుత్వం కూడా విస్మరించడం ద్వారా చరిత్రను అపహాస్యం చేస్తూ వస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత దీనిని ఘనంగా జరపాల్సిన ప్రభుత్వం దానిని దాటవేయడం ద్వారా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. దీనిపై తెలంగాణ ఉద్యమ సమయంలో మాట్లాడిన నేతలు ఇప్పుడు మాట్లాడకపోవడం మరింత అవమానకరం. తెలంగాణలో రజాకార్లు చేసిన ఘాతుకం రక్తచరిత్రకు తార్కాణం. వారి దాష్టీకానికి ప్రజల మాన,ధన, ప్రాణాలు పోయాయి. అన్నింటికి మించి ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మలు ఆడించారు. ఇక అత్యాచార ఘటనలకు అంతేలేదు. భర్తల ముందే మహిళలపై సామూహిక అత్యాచారాలకు తెగ బడ్డారు. అడ్డొచ్చిన మహిళల భర్తలను అడ్డంగా తెగనరికారు. విమో చన దినోత్సవం జరపడం అంటే దాష్టీకాలను ఎండగట్టడం మాత్రమే. ఆనాటి అరాచాకాలను గుర్తు చేసుకోవడం. ఆనాటి ఘటనల్లో మరణించిన ప్రజలకు నివాళి అర్పించడం. ఎందరో అమాయక స్త్రీలు తమ మానప్రాణాలు కోల్పోయి బలిదానం అయ్యారు. వారిని స్మరించుకుని వారికి నివాళి అర్పించడం మాత్రమే. నిజాం లొంగిపోయిన రోజు అనడం కంటే ఓ నిరంకుశుడిని పారదోలిన కారణంగా హైదరాబాద్ విమోచన దినం జరపడం అన్నది తప్పులేదు. ప్రపంచ చరిత్రలో పోరాటాలన్నీ నిరంకుశత్వం మీద దాడుల కోసం జరిగినవే. వాటిని స్వాతంత్ర్య దినాలుగానే జరుపుకుంటున్నారు. తెలంగాణ విముక్తం కూడా ఒక స్వాతంత్ర్య దినోత్సవం లాంటిదిదే. క్రూర రాచరిక తరహా పాలన నుంచి విముక్తి జరిగిన రోజుగా గుర్తించాలి. గతంలోకి వెళితే... ఆఖరి నిజాంకాలంలో, క్రూర భూ స్వామ్యం పడగలెత్తి గ్రామాలను పీడించుకుని తింటున్న ప్పుడు, ప్రజలు తిరగబడ్డారు. పోరాడారు. భూములు ఆక్రమించుకుని పంచు కున్నారు, మరోవైపు నిజాం ను కీలుబొమ్మ చేసుకున్న రజాకార్లు కమ్యూనిస్టులపైన, కొన్ని చోట్ల కాంగ్రెస్ వారిపై, ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడ ఉంటే అక్కడ దౌర్జన్యాలు చేశారు. భూస్వాముల గడీల్లో ఆశ్రయం పొందుతూ వారి తరపున దాడులు చేశారు. పెద్ద ఎత్తున రక్తపాతం జరిగింది. బైరాన్‌పల్లి, పరకాల ఇలా ఎన్నోచోట్ల అరాచకాలకు అడ్డూ అదుపులేకుండ ఆపోయింది. కేవలం జలియన్‌వాలా బాగ్ గురించి మాత్రమే చెప్పుకుంటాం. పరకాలలో నరమేథం సాగింది. బైరాన్‌పల్లిలో ఆడవాళ్లను నగ్నంగా బతుకమ్మ లను ఆడించారు. పొలాలపై దాడులు చేశారు. ధాన్యాన్ని తరలించారు. క్రూరంగా హింసించారు. బహుశా భారతదేశ చరిత్రలో ఇంతటి దారుణాలు జరిగినా స్వాతంత్ర్య పోరాటం కారణంగా ఇవన్నీ మరుగున పడిపోయాయి. మరోవైపు నిజాం, భారత, పాకిస్థాన్ దేశాలు రెంటితోనూ తాను కలవబోనని, స్వతంత్రంగా ఉంటానని ప్రకటించాడు. ఓ దశలో పాక్‌లో కలవడానికి కూడా సిద్ధం అని ప్రకటించాడు. భారత ప్రభుత్వంతో ఆ విషయమై చర్చలు, వాదాలు సాగుతూ ఉండగానే, మరో వైపు కమ్యూనిస్టుల పోరాటం సాగుతూ ఉన్న దశలోనే, భారత ప్రభుత్వం సైనికచర్య జరిపింది. నిజాం లొంగిపోయాడు. నిజాం లొంగడానికి అంతా సాజావుగా సాగలేదు. ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య తీసుకుని ఉండకపోతే హైదారాబాద్ సంస్థనం చరిత్ర మరోలా ఉండేది. అన్ని సంస్థానాలను విలీనం చేసిన సందర్భంగా ఎలాంటి పేచీ రాకున్నా కాశ్మీర్ విషయంలో మొన్నటి దాకా పంచాయితీ తేలలేదు. 370 రద్దుతో మొన్నటికి మొన్న అది సంపూర్ణంగా భారత్‌లో విలీనం అయ్యింది. తెలంగాణ విషయంలో కూడా నెహ్రూ జోక్యం ఉండివుంటే కాశ్మీర్ లాంటి పరిస్థితి మనకు ఉండేది. అయితే తెలంగాణలో రజాకార్ల పాలనలో జరుగుతన్న అరాచాకాలను అందరూ ఎదరించి ప్రాణాలు కోల్పోయారు. నిరంకుశ రాచరిక తరహా పాలన స్థానంలో ప్రజాప్రాతినిధ్య పాలన కోసం జరిగిన పోరాటం అంతా ఇంతాకాదు. తెలంగాణ అంతర్భాగంగా ఉన్న హైదరాబాద్ రాజ్యంలో జరిగింది జాతీయోద్యమం కాకున్నా అరాచక పాలనను అంతమొందించేందుకు ప్రజలు సాయుధ పోరాటం చేయాల్సి వచ్చింది. గాంధీతో సహా కాంగ్రెస్ వారు ఆనాడు ఇక్కడి ప్రజల గురించి పట్టించు కోలేదు. ఇక కమ్యూనిస్టులు చేసింది భూస్వామ్యా నికి వ్యతిరేకంగా భూమికోసం విముక్తి పోరాటం మాత్రమే. అయితే రజాకార్ల దాష్టీకానికి ప్రజలు సమాయత్తం అయినప్పుడు అంతా కలసి కదిలారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి వీరులు చేసిన త్యాగం తక్కువేం కాదు. 1948 సెప్టెంబర్ 13-17 మధ్య జరిగింది భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యంపై జరిపిన పోలీసు చర్య కారణంగా హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం అయ్యింది. ఈ చర్యను కాంగ్రెస్ పార్టీ ఆహ్వానించడం తో పాటు, ప్రజలు కూడా సంతోషించి సంబరాలు చేసుకున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి జరిగిన విముక్తి పోరాటం కావడంతో ప్రజల్లో సహజంగానే ఆనందం వెల్లి విరిసింది. బానిస సంకెళ్లు తెగినందుకు ఆనందించారు. కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ వేదికగా దీనిని ఆనాడు ప్రస్తావించిన విషయాన్ని మరచిపోయారు.

# కోరిన కోర్కెలు తీర్చే

## అనంతగిరి - అనంత పద్మనాభస్వామి

**అనంతగిరి దేవాలయం**



అనంత పద్మనాభస్వామి దేవాలయం

అనంతగిరి తెలంగాణలోని వికారాబాద్‌కి 5 కిమీల దూరంలో అనంత పద్మనాభస్వామి వారి దేవాలయం ఉంది. అఖిల జగాలకు ఏలికైన శ్రీ అనంత పద్మనాభస్వామియొక్క ఈ ఆవాసము అటవీ ప్రదేశం ! అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ మహావిష్ణువు పానుపైన ఆదిశేషుని శిరస్సు ఏడుకొండలలోని శేషాద్రని, నడుము భాగము అహోబిలమని, తోక భాగమీ అనంతగిరి అని చెప్తారు. అంతేకాదు హైదరాబాద్ ప్రాంతంలో ప్రసిద్ధికెక్కిన ముచికుందానది (అదే మూసీనది) జన్మస్థానం ఇక్కడే. కొన్నివేల సంవత్సరాలకు పూర్వం మృకండ మహర్షి తనయుడైన మార్కండేయుడు విష్ణు సాక్షాత్కారం కోసం ఇక్కడ తపస్సు చేశాడు. కలియుగ ప్రారంభమున శ్రీ మహావిష్ణువు మార్కండేయ మహామునికి దర్శనమిచ్చి అతని కోరికపై అక్కడ సాలగ్రామ రూపంలో వెలిశాడు. ఆ సాలగ్రామానికి ఉదర, చాతి భాగంలో లెక్కపెట్టలేనని చక్రాలు ఉన్నాయంటారు. అందుకని ఆ స్వామిని అనంతుడన్నారని అక్కడి పుజారులు నమ్మకం. ఇక్కడ ఒక సొరంగ మార్గం వుంది. ఆ మార్గము కాశీదాకా ఉన్నదని అంటారు. మార్కండేయ మహర్షి నిత్యం ఆ మార్గం గుండా కాశీవెళ్లి గంగలో స్నానం చేసి వచ్చి స్వామిని అర్చించేవారట. మార్కండేయ మహర్షి కాలంలోనే ముచుకుందుడనే రాజర్షి ఉండేవాడు. ఆయన ఒకసారి చాలా సంవత్సరాలు రాక్షసులతో యుద్ధంచేసి వారిని ఓడించాడు.

బాగా అలసిపోయి వుండడంతో భూలోకంలో తాను అలసట తీర్చుకోవడానికి సుఖంగా కొంతకాలం నిదురించుటకు అనువైన ప్రదేశం చెప్పమని ఇంద్రుని కోరాడు. అంతేకాదు తన నిద్రాభంగము చేసినవారు తన తీక్షణ దృక్కులతో వెంటనే భస్మమైపోయేట్టు వరాన్ని కూడా ఇంద్రుడినుంచి పొందాడు. ఈ రమణీయ ప్రదేశానికి వచ్చి ఇక్కడున్న ఒక గుహలో నిదురించసాగాడు. ద్వాపర యుగమున శ్రీకృష్ణుడు కంస వధానంతరం తన రాజ్యాన్ని జనరంజకంగా పాలిస్తున్నాడు. ఆ సమయంలో కాలయవనుడు శివుడి గూర్చి తపస్సుచేసి ఏ ఆయుధంచేత తను చంపబడకుండా వరం పొందాడు అంతట ఆ రాక్షసుడు ద్వారకమీద దండెత్తివచ్చి యాదవ సైన్యాన్ని చిత్తుచేసి మధురానగరాన్ని స్వాధీనం చేసుకున్నాడు. శ్రీకృష్ణుడు కాలయవనునికి భయపడినట్టు నటించి అతను చూస్తుండగా ఈ ప్రదేశానికి వచ్చారు. కాలయవనుడు కూడా శ్రీకృష్ణుణ్ణి వెంబడించి ఇక్కడికి వచ్చాడు. అంతట శ్రీకృష్ణుడు తన వస్త్రము నిదురించుచున్న ముచికుందునిమీద కప్పి పక్కకి తప్పుకున్నాడు . కాలయవనుడు శ్రీకృష్ణుని వస్త్రములు చూసి నిదురించుచున్నది కృష్ణుడే అనుకుని అతని నిద్రభంగముగావించారు. నిద్ర మేల్కొనిన ముచికుందుని తీక్షణ దృక్కులు పడి కాలయవనుడు భస్మమయ్యాడు. అప్పుడు ముచికుందునికి శ్రీకృష్ణుడు ప్రత్యక్షము కాగా ఆయన పాదాలు కడిగి ధన్యుడయ్యాడు. లిముచికుందుడు శ్రీకృష్ణ పాద ప్రక్షాళన చేసిన జలమే జీవనదియై ఆయన పేరుమీద ముచికుంద నదియై కాలక్రమేణా మూసీ అయినదిలి. ఈకథను 'శ్రీకృష్ణవిజయము' (1971) అనే స ి ని వ ా ల ో చూడవచ్చు.అనంతపద్మనాభుడిని కొలిచి అంతులేని సుఖాలను పొందుతారని స్థల మహాత్మ్యం చెప్తుంది.అనంతానంత దేవేశ అనంత ఫలదాయకాలి అనంత దుఃఖనాశాయ అనంతాయ నమోనమః"లి

కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా
9848445134

# బిజెపిలో చేరిన ఇతర పార్టీ నేతలు ఆహ్వానించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం,ప్రస్తుతం రెండేళ్లుగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాల వల్లే ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నాయకత్వాన్ని సమర్థించేలా వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ లో చేరుతున్నారని చెప్పారు.బేలా మండలంలోని మసాలా (కే),దుబ్బా గూడ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీ లో చేరారు.ఆదిలాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలను కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పాయల్ శంకర్ మాట్లాడుతూ గత ఎమ్మెల్యే,ఎంపీ ఎన్నికల్లో బీజేపీ ని ఆశీర్వదించిన మాదిరిగానే రానున్న ఎన్నికల్లో సైతం బీజేపీని బలపరుస్తున్న అభ్యర్థులకు మద్దతు పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వ తీరును చూస్తే గ్రామాల్లో కనీసం బల్బులు పెట్టలేని దుస్థితి నెలకొందన్నారు.అనేక సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు అష్ట సుభాష్,పోతరాజు,రమేష్,దినేష్,రాము తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ - కేసుల పరిష్కారానికి గొప్ప అవకాశమని హైకోర్టు న్యాయమూర్తి అభిప్రాయం

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్**

**బ్యూరో సెప్టెంబర్ 13.**




రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్ కోషి జాతీయ లోక్ అదాలత్‌ను కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడానికి ఒక "గొప్ప అవకాశం"గా అభివర్ణించారు.శనివారం నిర్మల్‌లోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన మూడవ జాతీయ లోక్ అదాలత్ మరియు కమ్యూనిటీ మధ్యవర్తిత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవ సమావేశంలో ప్రసంగిస్తూ జస్టిస్ కోషి మాట్లాడుతూ, లోక్ అదాలతులు పరస్పర అంగీకారంతో రెండు పక్షాలకు న్యాయం అందజేస్తాయని, కేసులు త్వరగా పరిష్కారం కాని విధంగా సహకరిస్తాయని తెలిపారు. "ఈ వ్యవస్థ న్యాయపరమైన వివాదాలను తగ్గించడమే కాకుండా, కేసుదారులు ప్రశాంతమైన జీవితం గడపడానికి అవకాశం కల్పిస్తుంది" అని ఆయన అన్నారు.అతిథి విశిష్టురాలిగా హాజరైన జస్టిస్ సుజనా కలసికం మాట్లాడుతూ, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులకు ఇప్పుడు లోక్ అదాలతల ద్వారా శాశ్వత పరిష్కారాలు లభిస్తున్నాయని తెలిపారు. కట్నం, గృహ హింస, చెక్కు బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదాలు వంటి అంశాలను తక్కువ ఖర్చుతో, వేగంగా పరిష్కరించవచ్చని ఆమె వివరించారు.జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఎస్. శ్రీవాణి మాట్లాడుతూ, లోక్ అదాలతల గురించి అవగాహన పెంచడం, ప్రజలను వివాదాలను సఖ్యపూర్వకంగా పరిష్కరించడానికి ప్రోత్సహించడం లో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. క్రిమినల్ మరియు సివిల్ కేసులు, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి సమస్యలు వంటి వాటిని ఈ వేదిక ద్వారా సమర్థవంతంగా పరిష్కరించవచ్చని ఆమె అన్నారు.జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ మాట్లాడుతూ, లోక్ అదాలత సేవలు న్యాయవ్యవస్థపై భారాన్ని తగ్గిస్తాయని, పెండింగ్ కేసులకు ముగింపు పలుకుతున్నాయని పేర్కొన్నారు. "దేశవ్యాప్తంగా లక్షలాది కేసులు ఈ విధానం ద్వారా వేగంగా మరియు సమర్థవంతంగా పరిష్కరించబడుతున్నాయి" అని ఆయన అన్నారు.కార్యక్రమంలో తమ కేసులను వెనక్కి తీసుకున్న కేసుదారులను న్యాయమూర్తులు, కలెక్టర్, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అభినందించి, వన్యప్రాణుల దాడిలో గాయపడ్డ వారికి మంజూరైన పరిహార చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ప్రముఖ అతిథులను సన్మానించారు.ఇంతకుముందు, హైకోర్టు న్యాయమూర్తులను అటవీశాఖ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీలు మొక్కలతో ఆహ్వానించగా, పోలీసుల నుండి గార్డ్ ఆఫ్ హానర్ అందించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ సేవాధికార సంఘం సభ్యుడు పంచాక్షరి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక, ఎస్పీ జంకి శర్మిళ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కోర్టు అధికారులు, న్యాయవాదులు, ప్రజలు హాజరయ్యారు.

# బిజెపి ఆధ్వర్యంలో పార్టీ నాయకులకు సన్మానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు అంబటి నవీన్ ఆధ్వర్యంలో జిల్లా నూతన ప్రధానకార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, నూతన కార్యదర్శి సంగెం అనిల్ లను ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# బాధిత కుటుంబానికి బిజెపి నాయకుల ఆర్థిక సాయం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామానికి చెందిన పెండెం వానిల్ కుమార్ గుండెపోటుతో మరణించగా, వారి కుటుంబాన్ని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి జమిలిగిరి సాయికిరణ్, స్థానిక పార్టీ నాయకులతో కలసి పరామర్శించారు. వారి కుటుంబానికి జే.సాయికిరణ్, కందుకూరి సంపత్ గౌడ్, కందుకూరి శ్రీకాంత్ గౌడ్ లు కలిసి 10 వేల ఆర్థిక సహాయం చేశారు. వారి కుమారుడు రూపేష్ ఉన్నత విద్యాభ్యాసానికి అండగా ఉంటామని సాయి కిరణ్ భరోసా కల్పించారు.



# ఎగ్ బాబా కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

సీనియర్ రాజకీయ నాయకులు, ప్రజా సేవకులు ఎగ్ బాబా ఇటీవల అకాల మరణం చెందగా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎగ్ బాబాతో ఉన్న స్నేహాన్ని వారి కుమారులతో పంచుకున్నారు. ఎల్లప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా నన్ను సంప్రదించాలని ఎమ్మెల్యే అన్నారు.



# జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిగా దయానంద్ బాధ్యతల స్వీకరణ

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 13.**

కామారెడ్డి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన టి. దయానంద్ బదిలీపై నిర్మల్ జిల్లా షెడ్యూల్డ్ కాస్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్  గా బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం దయానంద్ కలెక్టర్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆమెకు ఒక మొక్కను అందజేశారు. కలెక్టర్ ఆయనను అభినందిస్తూ షెడ్యూల్డ్ కాస్ట్‌ల సంక్షేమం మరియు అభివృద్ధికి సంబంధించిన ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, మరింత మంది లబ్ధిదారులు చేరుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు హాజరయ్యారు.



# ఎస్సారెస్పీని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తులు

## జడ్జీలతో భేటీ అయిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 13 :**

నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ లో గల శ్రీరాంసాగర్ ప్రాజెక్టును రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.సామ్ కోషి, జస్టిస్ సృజన శనివారం సందర్శించారు. పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాలో పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఎస్సారెస్పీని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తులను నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం, హైకోర్టు జడ్జిలు కలెక్టర్ తో భేటీ అయ్యి ఎస్సారెస్పీ ప్రాజెక్టు గురించి, జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.



# ఆదర్శ రైతు.. బొప్పాయి సాగుబడి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వరి యేతర పంట సాగుబడి చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం వెంకట్రావు పల్లెలో రైతు పెంజర్ల బాల్ రెడ్డి, రైతులకు ఆదర్శంగా నిలిచారు. దశాబ్ద కాలం పైబడి మూడు ఎకరాల్లో నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ నూతన వంగడాలతో బొప్పాయి తోట సాగు చేస్తున్నారు. షరా మామూలు వరి దిగుబడి ఆదాయం కన్నా, బొప్పాయి సాగుబడితో గణనీయంగా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. గతంలో కిలో 5 రూపాయలు ఉన్న బొప్పాయి, ప్రస్తుతం కిలో 20 రూపాయలకు చేరింది. మొక్కలు నాటిన ఎనిమిది నెలల కాలంలోనే బొప్పాయి పంట చేతికి అంది.. ఏడాది పాటు నిరంతరంగా కొనసాగుతుంది. మూడు ఎకరాలు సాగులో ఏటా లక్షలకు పైబడి ఆదాయం అందుతుంది. ఇదిలా ఉండగా ఔత్సాహిక రైతులకు బొప్పాయి సాగుపై అవగాహన కలిగిస్తానని, మొక్కలు అందించడానికి సహకరిస్తామని అన్నారు.



# బాధిత కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ ఇంచార్జి సునీల్ కుమార్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

మెండోరా మండలంలోని పలు గ్రామాలలో బాధిత కుటుంబాలను శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ సునీల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. బుస్సాపూర్ గ్రామానికి చెందిన కోమన్పల్లి చిన్నయ్య (బ్రహ్మయ్య) మాతృవియోగం పొందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపాన్ని తెలిపారు. పోచంపాడు గ్రామానికి చెందిన అఖిల్ రోడ్డు ప్రమాదంలో మరణించగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపాన్ని ప్రకటించారు. ఇదే గ్రామానికి చెందిన అరవింద్ ఇటీవల ఆనారోగ్యంతొ మరణించగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపాన్ని తెలిపారు. పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# ముఖ్యమంత్రి రేవంత్ తో కంది శ్రీనివాస్ భేటీ

## ఆదిలాబాద్ సమస్యలపై సీఎంకు వినతులు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి శనివారం రోజు భేటీ అయ్యారు.జూబ్లిహిల్స్ లోని సీఎం నివాసంలో కలిసిన కంది శ్రీనివాసరెడ్డి నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్ళారు.ఆదిలాబాద్ అభివృద్ధిపై తనకు ప్రత్యేక విజన్ ఉందని సాగునీరు,తాగునీరు,విద్య,వైద్యపరంగా అన్నిరంగాల్లో ఆదిలాబాద్ ను ముందుకు తీసుకెళ్ళే విజన్ డాక్యుమెంట్ త్వరలో ప్రకటిస్తామని సీఎం ఈ సందర్భంగా చెప్పారని తెలిపారు.స్థానిక ఎన్నికల్లో మంచి విజయాలు సాధించాలని,ఆదిలాబాద్ జిల్లా పరిషత్ గెలవాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కందిని ఆదేశించారు.సిసిఐతో పాటు స్థానిక అంశాలపై వినతులు సమర్పించగా,సానుకూలంగా స్పందించారు.త్వరలో తాను ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వస్తానని సీఎం చెప్పారన్నారు.



# ఓపెన్ స్కూల్ విదానంతో టెన్త్, ఇంటర్ దూరవిద్య లో ప్రవేశాలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

అర్ధాంతరంగా విద్యాభ్యాసాన్ని మానేసిన మహిళలు, ఓపెన్ స్కూల్ విధానంతో 10వ తరగతి, ఇంటర్ విద్యలో ప్రవేశాలు పొందాలని కోరుతూ శనివారం బాల్కొండ మండలం కిషన్ నగర్ జెడ్పి ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ సాయన్న, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేయాలని, 9440885030 నంబర్ ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివో ఏ లహరిక, గ్రామ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వ్యాపారి బాబా కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

ఆర్మూర్ పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్త గుడ్ల బాబా స్వర్గస్తులవగా, వారి కుటుంబాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బిజెపి సేవాపక్షం కార్యశాల

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో శనివారము బిజెపి మండల అధ్యక్షుడు సొళ్ళ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో సేవా పక్షం (సేవాపఖ్వాడ) కార్యాశాల నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పార్టీ సీనియర్ నాయకులు సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ పాల్గొని కార్యకర్తలకు కార్యక్రమంపై అవగాహన కలిగించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు, జిల్లా పదాధికారులు, మండల పదాధికారులు, మండల కన్వీనర్లు, మండల కో కన్వీనర్లు పాల్గొన్నారు.



# జాతీయ లోక్ అదాలత్ లో 18,208 కేసుల పరిష్కారం: జిల్లా జడ్జి పి.నీరజ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 18,208 కేసులను పరిష్కరించడం జరిగిందని, అందుకు గాను రూ.3,06,77,036/- లను నష్ట పరిహారంగా ఇప్పించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారము నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమము వేదికపై వారూ మాట్లాడారు.

## కేసుల వివరాలు:

మోటార్ వాహన ప్రమాద కేసులు: 06, సివిల్ తగాదాలు : 07, క్రిమినల్ కేసులు: 284, ఎక్సైజ్ కేసులు: 18, చెక్ బౌన్స్ కేసులు : 13, కుటుంబ తగాదాలు : 11, సైబర్ క్రైమ్ : 80, బ్యాంకు కేసులు : 141, బిఎస్ఎన్ఎల్ : 25డ్రంక్ అండ్ డ్రైవ్ : 2384ట్రాఫిక్ చలాన్ కేసులు : 15,239 పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు.




# పేదలకు గొడుగులు పంపిణీ చేసిన కంది కిష్టారెడ్డి

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

సామజిక సేవలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా పాలు పంచుకుంటున్నారు.తమకు తోచిన రీతిలో సాయం చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారు.వర్షాకాలం నేపథ్యం లో శనివారం ఆదిలాబాద్ పట్టణం లోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ఆవరణలో పేదలకు గొడుగులు పంపిణి చేసి తమ ఔదర్యాన్ని చాటు కున్నారు.మున్ముందు కూడా ఇదే రకమైన సేవలను కొనసాగిస్తామని చెప్పారు.ఈకార్యక్రమంలో గిమ్మ సంతోష్ రావు,సందా నర్సింగ్,అల్చేట్టి నాగన్న,శ్రవణ్ నాయక్,రాంరెడ్డి,ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.



# వీధి కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు



సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 13 బజార్ హత్నూర్

బజార్ హత్నూర్ మండలం లోని గిర్నూర్ గ్రామంలో వీధి కుక్కల దాడి లోముగ్గురిని గాయ పరిచినవి వీధి కుక్కల నియంత్రించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు గ్రామం కుక్కల బేడద అధికంగా చిన్న పిల్లలను బయటికి పంపడానికి ప్రజలు జంకుతున్నారు పంచాయతీ అధికారులు వీధి కుక్కల వల్ల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# ఆడే అశోక్ ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 13 బజార్ హత్నూర్

నేరడిగొండ మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన ఆడే అశోక్ ఇటీవల క్యాన్సర్ చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సందర్భంగా శని వారం నాడు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ నాయకులు దేవేందర్ రెడ్డి, ఆడే కైలాష్, ఆత్మారామ్, రాథోడ్ సురేందర్, ప్రతాప్, సుజీల్, లింబాజి తదితరులు ఉన్నారు



# సుమారు 194 కోట్లతో..ఆధ్యాత్మికత ఉట్టిపడేలా రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు

**ప్రధాన ఆలయ విస్తరణ పనులు.. సులభ దర్శనం.. అన్నదాన సత్ర భవనం.. ప్రధాన రహదారి విస్తరణ పనులు షురూ**

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్



రాజన్న భక్తులకు సులభంగా స్వామివారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించే పనులకు శ్రీకారం చుట్టింది ప్రజా ప్రభుత్వం. వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ(వీ.టీ.డీ.ఏ) ఆధ్వర్యంలో ప్రధాన ఆలయ విస్తరణ, అన్నదాన సత్రం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. వేములవాడ మూల వాగు నుంచి ప్రధాన ఆలయం వరకు బ్రిడ్జి, రహదారి నిర్మాణం పనులు మొదలయ్యాయి. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా అన్ని నిర్మాణాలను ఆగమ శాస్త్రానుసారంగా పనులు చేపడుతూ భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు సర్వం సిద్ధమవుతుంది. వేములవాడ అభివృద్ధి ప్రణాళిక ఏకపక్షంగా కాకుండా, విస్తృత చర్చల అనంతరం ఖరారైంది. శృంగేరి పీఠాధిపతి ఆశీర్వాదం, పండితులు, ప్రముఖులు, పట్టణ పెద్దల సూచనలు, స్థానిక ప్రజల అభిప్రాయాలు, మీడియా వర్గాల సూచనలతో తుది రూపు దాల్చింది. ఆలయ నిర్మాణ డిజైన్ల ఇటీవల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు.

## మార్గం.. సుగమం.

వేములవాడలో ఎన్నో దశాబ్దాల కల నెరవేరనున్నది. మూలవాగు నుంచి శ్రీ రాజ రాజేశ్వర ఆలయం వరకు ఇప్పుడు ఉన్న 40 ఫీట్ల రోడ్డు స్థానంలో 80 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 47 కోట్ల 86 లక్షలు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరియు వి.టి.డి.ఏ. వైస్ చైర్మన్ %ు% కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చొరవతో రోడ్డు విస్తరణలో ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు నష్ట పరిహారం చెక్కులు అందజేసిన తరువాత కూల్చివేత పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. అలాగే మూల వాగు వద్ద స్థలాలు సేకరించి ఆ పనులు వేగంగా చేపట్టేలా కలెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించారు. రూ. 6 కోట్ల 56 లక్షలతో ప్రస్తుతం బ్రిడ్జి పనులు మొదలయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటు పట్టణ వాసుల ట్రాఫిక్ కష్టాలు దూరం కానున్నాయి.

### ఆకర్షణీయంగా మహా మండపం, గోపురాలు

మొదటి దశలోనే 111 కోట్ల రూపాయల వ్యయంతో మహా మండపం, నిత్య కల్యాణ మండపం, ధర్మ గుండం పునరుద్ధరణ, కొత్త రాజ గోపురాలు ఆకర్షణీయంగా నిర్మించేందుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. యాత్రికుల సౌకర్యార్థం విశాల ప్రాకారాలు, ప్రత్యేక క్యూ లైన్లు కూడా సిద్ధమవుతున్నాయి. రాబోయే దశల్లో గుడి చెరువు ఘాట్ అభివృద్ధి, బండ్ సుందరీకరణ, మల్టీ లెవెల్ పార్కింగ్, వాహనాల కోసం విస్తృత స్థలాలు కూడా అభివృద్ధి కానున్నాయి. అలాగే షాపింగ్ కాంప్లెక్సులు, హెల్ప్ డెస్క్, సాంస్కృతిక వేదికలు ఏర్పాటు కానున్నాయి. ఆలయం వద్ద రూ. 25 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఎంతో మందికి ఉపాధి కల్పించేందుకు వీలు కానున్నది.

### ఒకేసారి వెయ్యిమంది భోజనం చేసేలా..

రూ. 35.25 కోట్లతో అన్న దానసత్ర భవనం నిర్మాణం జరుగుతోంది. ఒకే సారి వెయ్యి మంది భోజనం చేసే డైనింగ్ హాల్, 600 మందికి వెయిటింగ్ హాల్, లడ్డూ తయారీ కేంద్రం, ఆధునిక వంట శాలలు అందించగల సామర్థ్యం కలుగనుంది.

## కొత్త నిర్మాణాలకు ..

వేములవాడలో ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పాత కట్టడాల కూల్చివేత, కొత్త నిర్మాణాలకు స్థలం సిద్ధం చేసే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే భారీ యంత్రాలతో పాత గోడలు, నిర్మాణాలను తొలగించి శుభ్రపరిచే ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ ప్రాజెక్ట్ కింద ?150 కోట్ల వ్యయంతో రహదారుల విస్తరణ, ?3.40 కోట్లతో భూసేకరణ, కంపౌండ్ వాల్ నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్ లు, మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నారు.

### భీమేశ్వర ఆలయంలో పనులు..

శ్రీ బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులు రూ. 10 కోట్ల నిధులతో శరవేగంగా కొనసాగుతున్నాయి. 12 కోట్ల నిధులతో గుడి చెరువులో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. రాజన్న ప్రధాన ఆలయంలో స్వామి వారికి నిత్య పూజలు యథావిధిగా కొనసాగుతాయి. శ్రీ భీమేశ్వర ఆలయంలో రూ. 3 కోట్ల 44 లక్షలతో కల్యాణ మండపం, హోమ, వ్రత మండపం, షెడ్ నిర్మాణం, క్యూ లైన్లు, సీసీ ఫ్లోరింగ్ పనులు కొనసాగుతున్నాయి.

### రాజన్న కోడెల సంరక్ష ణపై ప్రత్యేక దృష్టి

వేములవాడ రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడె మొక్కు. కోడెల సంరక్షణకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గోశాలలో సీసీ ఫ్లోరింగ్, షెడ్లు నిర్మింపజేశారు. ఇతర పారిశుద్ధ్య పనులు నిత్యం చేయిస్తున్నారు. ఇప్పటిదాకా చిన్న సన్నకారు రైతులకు మొత్తం 2 వేల కోడెలను పంపిణీ చేయించారు. కోడెల ఆరోగ్య సంరక్షణకు పశు వైద్య సిబ్బందిని నియమించారు. కోడెలకు నిత్యం పచ్చిగడ్డి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. గోశాలలోని జీవాలకు పచ్చగడ్డి సమస్య పరిష్కారానికి 40 ఎకరాల ప్రభుత్వ భూమిలో పచ్చగడ్డి పెంచేందుకు చర్యలు ప్రారంభించడం జరిగింది. జీవాలకు నిత్యం పచ్చగడ్డి అందుబాటులో ఉంటుంది.

### ఆలయ అభివృద్ధి పనులపై ప్రత్యేక పర్యవేక్షణ

వేములవాడ ఆలయ అభివృద్ధి పై మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, వీటీడీఏ వైస్ చైర్మెన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తరచూ సమీక్షలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. రహదారులు, డ్రైనేజీ, భూసేకరణ, భద్రతా చర్యలపై ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. వేములవాడ పట్టణం, శ్రీ రాజరాజేశ్వర ఆలయం అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక గమ్యస్థానంగా అవతరించనుంది.

ఆలయ అభివృద్ధి కి సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేసి ప్రత్యేక దృష్టి సారిస్తునందుకు ప్రత్యేక ధన్యవాదాలు..వేములవాడను టెంపుల్ సిటీగా మార్చడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక వేములవాడ ను టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు భారీగా నిధులు మంజూరు చేస్తున్నది. శృంగేరి పీఠాధిపతులు, వాస్తు పండితులు, ప్రముఖుల సలహాలు, సూచనలు మేరకు రాజన్న ఆలయాన్ని విస్తరిస్తున్నాము. భక్తులకు సులభంగా.. వేగంగా దర్శనం కల్పిస్తం..ఆలయ అభివృద్ధి కి సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేసి ప్రత్యేక దృష్టి సారిస్తునందుకు ప్రత్యేక ధన్యవాదాలు

## ప్రణాళిక ప్రకారం పనులు..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వీ.టీ.డీ.ఏ ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయ విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం గడువులోగా పనులు పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నాము. ఆలయ విస్తరణ, రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి సహకరిస్తున్న వేములవాడ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లా వైద్యాధికారిణి.. ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ





సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శనివారము జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ ఆకస్మిక తనిఖీ జరిపారు. ఆస్పత్రి నిర్వహణ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్, రక్త పరీక్షల రికార్డు, వ్యాక్సినేషన్ వివరాలు, గర్భిణీ స్త్రీలకు చికిత్స వివరాలు పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలపై అంకిత భావంతో శ్రద్ధ శక్తులతో పనిచేయాలని పేర్కొన్నారు. వారంలో మూడు రోజులు గర్భిణీలకు వైద్య సేవలు అందించడానికి, కాన్పులు చేయడానికి మరో ఇద్దరి డాక్టర్లను నియామకం చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రణవ, ఆరోగ్య పర్యవేక్షకులు మారెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# దేవీ నవరాత్రి ఉత్సవ మండపం ఏర్పాటుకు భూమి పూజా

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో



నిజామాబాద్ జిల్లా సీర్నపల్లి గడి దగ్గర దేవి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం మండపం ఏర్పాటుకు శనివారం సంతోష్ శర్మ చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవి నవరాత్రుల సర్వజన సమితి అధ్యక్షులు అంబేమ్ సాయిలు, గౌరవ అధ్యక్షులు హరిదాసు, గుజ్జ రాజేశ్వరి, బి.లింగయ్య, ముత్తన్న యాదవ్, నారాయణ, శీల శ్రీనివాస్ దేవి నవరాత్రుల ఉత్సవ సమితి కన్వీనర్, బుస్సాపూర్ శంకర్, కబూతర్ శంకర్, గంట జ్యోతి, శ్రీకాంత్, రాము పాల్గొన్నారు.

# మావయిస్ట్ అగ్రనేత సుజాతక్క లొంగుబాటు

## ధృవీకరించిన డిజిపి జితేందర్

**హైదరాబాద్,సెప్టెంబర్13(సమయజ్యోతి):**

మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన ఎలియాస్ సుజాతక్క తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. గద్వాల ప్రాంతానికి చెందిన ఆమె ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు. పశ్చిమబెంగాల్‌లో 2011 జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య ఆమె. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జిగా ఉన్నట్లు- సమాచారం. సుజాతక్క 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు. ఆమెతో పాటు మరికొందరు మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలుస్తోంది. సుజాతక్కపై రూ.కోటి రివార్డు ఉంది. సుజాతక్క లొంగుబాటు వివరాలను డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఆమె స్వస్థలం గద్వాల జిల్లా గట్టు- మండలం పెంచికలపాడు. ఆమె మొదట్లో ఆర్ఎస్‌యూ, జన నాట్యమండలిలో పని చేశారు. 1996లో కమాండర్‌గా విధులు నిర్వహించారు. 2001లో రాష్ట్ర కమిటీ- సభ్యురాలిగా పనిచేశారు. అనారోగ్య కారణాలతో సుజాతక్క బయటికి వచ్చారు. ఆమెకు రూ.25 లక్షల రివార్డు అందిస్తాం. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని ఆహ్వానిస్తున్నాం. మావోయిస్టులు చాలా మంది లొంగిపోతున్నారని జితేందర్ తెలిపారు.

# కారు దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

## ఏడుగురు నిందితుల అరెస్ట్

## కారు డ్రైవర్ మధు సూత్రధారిగా గుర్తింపు

**హైదరాబాద్,సెప్టెంబర్13(సమయజ్యోతి):**

శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారి దోపిడీని పోలీసులు ఛేదించారు. కారులో వెళుతున్న వ్యాపారిని అడ్డగించి దోచుకున్న కేసులో పోలీసులు వెంటనే దుండుగులను పట్టుకోగలిగారు. దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. జడ్చర్లలో శుక్రవారం అర్ధరాత్రి నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి స్టీల్ వ్యాపారి డ్రైవర్ మధు అని గుర్తించారు. వికారాబాద్ వెళ్లి నగదు తీసుకొస్తున్న విషయాన్ని మధు తన గ్యాంగ్‌కు చెప్పాడు. అనంతరం మధు, సాయిబాబాపై దాడి చేసినట్లు నటించి దుండగులు నగదు బ్యాగుతో పరారయ్యారని పోలీసులు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా కీసరకు చెందిన స్టీల్ వ్యాపారి రాకేశ్ అగర్వాల్ వికారాబాద్‌లో తనకు రావాల్సిన రూ.40 లక్షల కోసం డ్రైవర్ మధు, సహాయకుడు సాయిబాబాను శుక్రవారం ఉదయం పంపారు. వారిద్దరూ డబ్బు తీసుకొని కారులో తిరుగు ప్రయాణ మయ్యారు. శంకర్‌పల్లి మండలం హుస్సేన్‌పూర్-పర్వేద గ్రామాల మార్గంలోకి రాగానే ఓ కారు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఆ తర్వాత నిందితులు.. తుపాకీ, కత్తితో బెదిరించి డబ్బులు దోచుకెళ్లారు. అయితే కొద్దిదూరం వెళ్లాక నిందితుల కారు బోల్తాపడటంతో రూ.8.5 లక్షలు వదిలేసి మిగిలిన డబ్బుతో పరారయ్యారు. నిందితుల కోసం పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి పట్టుకున్నారు.

# కొండాసురేఖ-నాయిని మధ్య మళ్లీ విభేదాలు

## ఇద్దరు ధర్మకర్తల నియామకంపై నాయిని ఫిర్యాదు

**వరంగల్,సెప్టెంబర్13(సమయజ్యోతి):**

వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో వర్గ విబేధాలు మళ్లీ ముదురుదుతున్నాయి. భద్రకాళీ ఆలయ పాలకమండలి కమిటీ- విషయంలో మంత్రి కొండా సురేఖ , వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మధ్య చిచ్చురేగింది. తన నియోజకవర్గంలోని ఆలయంలో తనకు సమాచారం ఇవ్వకుండా ఇద్దరు ధర్మకర్తలను నియమించడంపై ఎమ్మెల్యే మండి పడుతున్నారు. కొండ సురేఖ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఇలాగే కొనసాగితే నష్టం జరుగుతుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా ఆలయ పాలక మండలి సభ్యులను ఎలా నియమిస్తారని అని ప్రశ్నించారు. దేవాదాయశాఖకు మంత్రి అయినంత మాత్రానా ఏదైనా చేయొచ్చా అని నిలదీశారు. తన నియోజకవర్గంలో మంత్రి పెత్తనం ఏంటని ధ్వజమెత్తారు. మంత్రి కొండా సురేఖ ఇదే పద్ధతి అవలంభిస్తే తాను చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అంతా మంత్రి చేశాక స్థానికంగా తాను ఉన్నది దేనికని, తన ఓపికకు పరీక్ష పెట్టవద్దని హెచ్చరించారు.

# వనదుర్గ ఆలయానికి వరదపోటు మరోమారు ఆలయం మూసివేత

**మెదక్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం వద్ద వరద ప్రవాహం మరోసారి పెరిగింది. జిల్లాలో కురిసిన భారీ వర్షానికి మంజీరానదిలో వరద ఉధృతి పెరిగింది. గర్భగుడి ముందు నుంచి వరద ప్రవహిస్తున్నది. దీంతో ఆలయాన్ని మరోసారి అధికారులు మూసివేశారు. ఇటీవలే కురిసిన వర్షాలకు దాదాపు నెల రోజులుగా మూతపడిన ఈ ఆలయం మూడ్రోజుల క్రితమే అమ్మవారి మూలవిరాట్ దర్శనాలు పునః ప్రారంభమయ్యాయి. ఇంతలోనే మరోసారి వరద పెరగడంతో ఆలయాన్ని మూసివేయాల్సి వచ్చింది. శనివారం తెల్లవారుజామున అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం ఆలయాన్ని మూసివేశారు. దుర్గామాతకు రాజగోపురంలో పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు రాకుండా కట్టడి విధించారు.

# పాలమూరు ఎత్తిపోతలకు గండికొడితే ఊరుకోం: నాగం

**మహబూబ్‌నగర్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి గండి కొట్టి నల్లగొండ జిల్లాకు నీటిని తరలించే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగం జనార్దన్ రెడ్డి హెచ్చరించారు. ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేసేందుకు పూనుకుంటే పార్టీలకతీతంగా ఉద్యమిస్తానని హెచ్చరించారు. అందుకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో పెద్దదిగా ఉన్న ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు అన్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంటు-న్నదని నాగం జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. అలాంటి ప్రయత్నాలు మానుకోకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిని, ప్రభుత్వాన్ని నాగం జనార్దన్ రెడ్డి హెచ్చరించారు.

# కృష్ణా జలాల వాటాలో రాజీలేదు

## -రాష్ట్రానికి రావాల్సిన 71శాతం రాబడతాం-ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తాం

## -న్యాయనిపుణులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,సెప్టెంబర్13(సమయజ్యోతి):**

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజ నాలకు కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా చాలా నష్టపోయామని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదన్నారు. న్యాయంగా రావాల్సిన నీటివాటాను సాధిస్తామని తెలిపారు. ఈ నెల 23 నుంచి కృష్ణా ట్రిబ్యునల్ విచారణ దృష్ట్యా.. నీటిపారుదల రంగ నిపుణులు, న్యాయ నిపుణులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది వైద్య నాథన్‌తో పాటు-, పలువురు ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 811 టీ-ఎంసీల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 71శాతం డిమాండ్ చేస్తున్నామన్నారు. ట్రిబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తామని చెప్పారు. తాగు, సాగునీటితో సహా పరిశ్రమలకు నీటి వినియోగానికి చర్యలు తీసుకుంటామన్నారు. -ట్రిబ్యునల్ విచారణ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వచ్చి సమీక్షిస్తారని తెలిపారు. తెలంగాణలో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65 శాతం మేర నీటి కేటాయింపులు ఉండాల్సిందేనని అన్నారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లుగా నీటి కేటాయింపులు ఉండాలని అందుకు అనుగుణంగా తాజా సమాచా రాన్ని -ట్రిబ్యునల్ కు సమర్పించా మన్న ఉత్తమ్... ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని జారవిడుచుకోబోమని పునరు ద్ఘాటించారు. జూన్, జూలై మాసాల్లో 80 టీ-ఎంసీల నీటిని అందుబాటు-లో ఉంచడంతో పాటు- ఆపరేషన్ ప్రోటోకాల్ అనుసరించి నీటిని వినియోగించుకునే స్వేచ్ఛ తెలంగాణకు ఉండేలా -ట్రిబ్యునల్ ముందు ఉంచుతామని తెలిపారు. ఏపీ అక్రమంగా వినియోగిస్తున్న 291 టీ-ఎంసీల నీటి ఉదంతం వెలుగులోకి వచ్చినందున... ఆ నీటిని పునర్విభజన చేయాల్సిందేనని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతోందని... రాష్ట్ర హక్కులను కూడా -ట్రిబ్యునల్ ఎదుట జరిగే వాదనల్లో వినిపిస్తామని చెప్పారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల అంశాలతో కూడిన ప్రత్యేక జీఓను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లే కృష్ణా జలాలను తెలంగాణ వినియోగించు కోలేక పోయిందని భారత రాష్ట్ర సమితి నేతలపై ఉత్తమ్ మండిపడ్డారు. గత పాలకుల ఉదాసీనత కారణంగా ఏపీ అక్రమంగా నీటిని తరలించుకుపోయి ప్రయోజనం పొందిందని విమర్శించారు.



# గ్రూప్ -1 అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ

## -2లక్షల ఉద్యోగాల హామిని విస్మరించిన రేవంత్-అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్ ఏం మాట్లాడారు

## -నిరుద్యోగుల పక్షాన అసెంబ్లీలో పోరాడుతాం-నిరుద్యోగ మేళాలో ఎమ్మెల్యే హరీష్ రావు





**సిద్ధిపేట,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

గ్రూప్ వన్ పరీక్ష అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని మాజీ మంత్రి బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిండని విమర్శించారు. రాహుల్ గాంధీని అశోక్ నగర్ లో కూర్చోబెట్టి హామీ ఇచ్చి మోసం చేశారు అని అన్నారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామని.. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని.. మీకు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సిద్ధిపేటలో మెగా జాబ్ మేళా కార్యక్రమానికి హరీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్ వన్ లో ఉద్యోగానికి మంత్రులు, అధికారులు లక్షల రూపాయలు నిరుద్యోగుల వద్ద లంచం అడిగారని చెబుతున్నారని ఆయన మండిపడ్డారు. తప్పును సరిదిద్దుకోకుండా మరోసారి అప్పీల్‌కి వెళ్లాలని ప్రభుత్వం భావించడం సిగ్గుచేటని.. అన్నారు. పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చుని హరీశ్ పేర్కొన్నారు.. చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే బాగుండు మంచి ఉద్యోగం వస్తేనే బాగుండు అని అనుకుంటారు. తప్పులేదు అలా అనుకోవడంలో.. కానీ జీవితంలో మొదటి అడుగు పడడం అనేది చాలా ముఖ్యమని పేర్కొన్నారు.సిద్ధిపేట దాటి హైదరాబాదులో ఉద్యోగం చేస్తేనే మీకు అనుభవం వస్తుంది. ఉద్యోగం కోసం మీరు ఊరుదాటి వెళితే మీకు ప్రపంచం అర్థమవుతుంది. పోటీ- ప్రపంచంలో నువ్వెక్కడున్నావు, ఎక్కడ నిలబడ్డావు, ముందుకు సాగాలంటే ఏం చేయాలనే విషయాలతో మీ ఆలోచన విధానంలో మార్పు వస్తుంది. కష్టం యొక్క విలువ తెలుస్తుంది డబ్బు విలువ తెలుస్తుందని హరీశ్ తెలిపారు. ఉన్నత ఉద్యోగానికి, ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నం చేస్తూ ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోండని యువతకు తెలిపారు. రాష్ట్రంలో ఈరోజు ఏం జరుగుతుందో మీకు తెలవనిది కాదు.. గ్రూప్ వన్ ఎగ్జామ్ పెడితే నిరుద్యోగులు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. లక్షల రూపాయలు ఫలాన మంత్రులు, ఫలాన అధికారులు లంచం అడిగారు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా పరీక్ష నిర్వహిస్తారా అని స్వయంగా హైకోర్టు ప్రభుత్వంపై మొట్టికాయలు వేసింది. నిజంగా తప్పు చేయకపోతే ముఖ్యమంత్రి సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి. అవినీతికి పాల్పడ్డ వారిని శిక్షించాలి. తప్పును సరిదిద్దకుండా మరో అప్పీల్‌కి పోదామని చెప్పడం మూర్ఖత్వం. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. రెండేళ్లు పూర్తకావస్తున్నాయి. 2 లక్షలు ఉద్యోగాలు ఏమయ్యాయి రేవంత్ రెడ్డి? రాహుల్ గాంధీని అశోక్ నగర్ చౌరస్తాలో కూర్చోబెట్టి మాటిచ్చారు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. ఏమైంది?' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగ నోటిఫికేషన్ వేసింది కేసీఆర్.. పరీక్ష నిర్వహించింది కేసీఆర్..
ఇంటర్వ్యూ నిర్వహించింది కేసీఆర్.. కేవలం ఉద్యోగ పత్రాలు ఇచ్చింది మాత్రం రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తే చర్చ పెట్టకుండా ఒక అంశాన్ని బట్టి జాబ్ క్యాలెండర్ అని పారిపోయారు. జాబ్ క్యాలెండర్ కాదు అది జాబ్ లెస్ క్యాలెండర్.. ప్రియాంక గాంధీతో హుస్నాబాద్ సభలో చెప్పించారు.. నిరుద్యోగ యువతకు నాలుగువేల నిరుద్యోగ భృతి ఇస్తామని. ఏమైంది.? ప్రభుత్వం నిరుద్యోగ యువతని పూర్తిగా మోసం చేసింది. మీ పక్షాన మేము పోరాటం చేసి అసెంబ్లీలో ప్రశ్నిస్తాము. మీకు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తామని హరీశ్ అన్నారు. వెటర్నరీ కాలేజ్ ని సిద్దిపేటలో పెడితే రేవంత్ రెడ్డి కొడంగల్ కి తరలించారు. సిద్దిపేటకు అన్యాయం చేశారు. వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి కట్టించాము. 90శాతం పని పూర్తయింది. ఆ చిన్న పనిని కూడా చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. ఈ ప్రభుత్వం పాజిటివ్ డైరెక్షన్ కంటే నెగటివ్ డైరెక్షన్ లో ఎక్కువ వెళ్తుందని హరీశ్ పేర్కొన్నారు. మరిన్ని జాబ్ మేళాలు మీకోసం ఏర్పాటు- చేస్తామని యువతకు భరోసా కల్పించారు. మొన్న నేను లండన్ కి వెళ్ళినప్పుడు కూడా మన ఐటీ- టవర్లో కంపెనీలు ఏర్పాటు- చేయాలని అక్కడ ఉన్న తెలంగాణ బిడ్డలను కోరడం జరిగింది. ఈసారి ఎంతమందికి అవకాశం వస్తే అంతమంది ఉద్యోగాల్లో చేరాలని కోరుతున్నాను. దాదాపు 30 కంపెనీలు మీకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఇక్కడికి వచ్చాయి. మీ ఆలోచన సిద్దిపేట నుండి హైదరాబాద్‌కి పరిమితం కావద్దు. ముంబై కో, ఢిల్లీ అక్కడి నుండి ప్రపంచవైపుకు సాగాలి. ఇతర దేశాల్లో మన దగ్గర నుంచి వెళ్లిన పిల్లలు చదువుతూ చిన్న ఉద్యోగం అయినా చేస్తూ వారి కలలను సహకారం చేసుకుంటారు. ఇక్కడ మనమూ ఈ జాబ్ చేయాలా అంటే చిన్న ఉద్యోగం చేయాలనే అనుకుంటాం కానీ అక్కడ ఉద్యోగం చేయడమే గౌరవంగా భావించి చిన్నదైనా, పెద్దదైన చేస్తూ వారి లక్ష్యాన్ని సాధిస్తారు. మీరు కూడా మొదటి అడుగు వేయండి. పోటీ-ప్రపంచంతో పోటీ-పడి జీవితంలో మిమ్మల్ని మీరు సాధించండని హరీశ్ యువతకు హరీశ్ మార్గదర్శనం చేశారు.

----------

# కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఔదార్యం

## -అంధ బాలుడి కుటుంబానికి అండ-ఏడున్నర లక్షల చెక్కు అందచేత

**సంగారెడ్డి,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**



సామాజిక సేవా కార్యక్రమాల్లోనే కాదు.. ఉదారతలో సైతం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జయప్రకాశ్ రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి ముందుంటారు. తాజాగా ఆయన మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమత మవుతున్న అంధ బాలుడి కుటుంబానికి ఆయన అండగా నిలిచారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం లోంకా తండాకు చెందిన వికాస్ నాయక్ మూడేళ్ల వయస్సులో అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో అతడు కంటి చూపును కోల్పోయాడు. అతడి తల్లిదండ్రులు ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా..వికాస్‌కు చూపు మాత్రం రాలేదు. ప్రస్తుతం నిజామాబాద్‌లోని అంధుల పాఠశాలలో వికాస్ ఐదో తరగతి చదువుతున్నారు. ఇక అతడికి చూపు లేకున్నా వికాస్ నాయక్.. గాయకుడిగా రాణిస్తున్నాడు. అయితే వికాస్ నాయక్ తండ్రికి రెండు కిడ్నీలు పాడైపోయి.. మంచం పట్టాడు. వికాస్ కంటి చూపు కోసం.. అతడి తండ్రి చికిత్స కోసం ఆ కుటుంబం భారీగా అప్పు చేసింది. దీంతో అసలుతోపాటు వడ్డీ సైతం భారీగా పెరిగిపోయింది. అప్పు వడ్డీ కలిసి.. దాదాపు రూ. 6 లక్షలకుపైగా దాటింది. ఈ నేపథ్యంలో ఇటీవల వికాస్ కుటుంబ సభ్యులు.. జగ్గారెడ్డిని కలిసి కుటుంబ పరిస్థితిని వివరించి.. తమకు సహాయం చేయాలంటూ జగ్గారెడ్డికి అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో శనివారం సంగారెడ్డిలోని తన నివాసానికి వికాస్ కుటుంబాన్ని జగ్గారెడ్డి పిలుపించుకున్నారు. ఈ సందర్భంగా రూ. 7.50 లక్షల చెక్కను వికాస్ కుటుంబానికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా అంధుడైన వికాస్ గానం చేసిన పాటలకు జగ్గారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. వికాస్‌కు స్మార్ట్ ఫోన్‌ను కొనుగోలు చేసి అందజేశారు. తాను ఇచ్చిన నగదుతో అప్పు తీర్చడమే కాకుండా.. యూట్యూబ్ చానల నిర్వహించుకునేందుకు మిగిలిన మొత్తాన్ని వినియోగించాలంటూ వికాశ్ కుటుంబ సభ్యులకు పీసీసీ వర్కింగ్ ఆ డబ్బుతో అప్పును పూర్తి తీర్చడమే కాకుండా యూట్యూబ్ ఛానల్ నిర్వహణకు మిగిలిన మొత్తాన్ని వెచ్చించాలని వికాస్‌కు సూచించారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ.. బాగా చదువుకుని కలెక్టర్ అవడమే తన లక్ష్యమని వికాస్ నాయక్ ఈ సందర్భంగా జగ్గారెడ్డికి వివరించారు. అనంతరం స్వయంగా ఆయనే కారును ఏర్పాటు- చేసి వికాస్ నాయక్ కుటుంబాన్ని వారి స్వస్థలానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పంపించారు.

# ఎక్సైజ్ సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించాలి

## -అవసరమైతే వారికి ఆయుధాలు కూడా ఇస్తాం-అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి

హైదరాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

ఎక్సైజ్ సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించేందుకు అవసరమైతే వారికి ఆయుధాలు ఇస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గంజాయి, డ్రగ్స్, నాటు-సారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగంపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు ఉక్కుపాదం మోపాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. ప్రజల ప్రాణాల రక్షించే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని అన్నారు. ఎక్సైజ్ శాఖ భవన్‌లో అధికారులతో జూపల్లి కృష్ణారావు శనివారం నాడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఎస్టీఎఫ్ టీ-మ్‌లు, మంచిగా పని చేసేవారికి అవసరమైతే ఆయుధాలను కూడా ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా ఉందని వెల్లడించారు. ఈ మేరకు మంచిగా పని చేసే వారిని గుర్తించి వారికి శిక్షణ ఇవ్వాలని మంత్రి అదేశించారు. నల్ల బెల్లం తయారీ, అమ్మకాలు, వినియోగంపై పూర్తి స్థాయిలో అధ్యాయనం చేయాలని జూపల్లి కృష్ణారావు సూచించారు. ఎ-కై-÷-సజ్‌శాఖ పట్టు-కున్న నల్ల బెల్లాన్ని రైతులకు సేంద్రియ ఎరువుల తయారీకి ఇవ్వడానికి అవసరమైన మార్గ దర్శకాలను రూపొందించాలని ఆదేశించారు. నాన్ డ్యూటీ- పెయిడ్ లిక్కర్‌ను పట్టు-కున్నప్పుడు వాటిని పగులగొట్టకుండా, వినియోగించు కోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. వాటిని జాతీయ ఉత్పత్తిగా గుర్తించి అమ్మకాలు చేపట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయితో పాటు- సింథటిక్ డ్రగ్స్ తయారీ, అమ్మకాలు, రవాణా, వినియోగంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని మంత్రి జూపల్లి సూచించారు. నాచారం, చర్లపల్లి లాంటి ఇన్‌లీగల్ పరిశ్రమలను తనిఖీలు చేపట్టడానికి అవసరమైన కార్యాచరణ తయారు చేసుకోవాలని సూచించారు. ఒకే లైసెన్స్‌పై ఒకటి కంటే ఎక్కువ బార్లు నడుపు తున్నారని పలువురుపై ఆరోపణలను వస్తున్నాయని.. వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫామ్ హౌస్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాలని, బ్రాండీ షాపుల సిట్టింగ్ రైమ్‌లపై నిబంధనలు పాటించాలా చర్యలు చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న రైస్ మిల్లులను, ఇతర ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ లోని ఆబ్కారీ భవన్లో రాష్ట్ర ఆబ్కారీ, ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కల్తీ మద్యం, డ్రగ్స్ హడల్స్‌ట్రేషన్ వంటి సమస్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. మంత్రి



మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని, ఎక్కడైనా కల్తీ మద్యం లేదా డ్రగ్స్ లాంటి అక్రమ కార్యకలాపాలు జరిగితే ఉపేక్షించేది లేదని అధికారులకు స్పష్టంగా హెచ్చరించారు. గతంలో చోటు-చేసుకున్న ఘటనలపైనా కఠిన చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. చర్లపల్లి ఘటనపై వస్తున్న వార్తలకు మంత్రి సమాధానం ఇచ్చారు. అక్కడ 12 వేల కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ పట్టు-బడ్డాయన్న వార్తలు వాస్తవం కాదని, నిజానికి 3 నుండి 4 కోట్ల వరకు మాత్రమే ఉన్నట్లు- అంచనా వేశామని ఆయన స్పష్టం చేశారు. ఆ ప్రదేశం పెద్ద ఫ్యాక్టరీ కాకుండా చిన్న షెడ్ మాత్రమేనని, అక్కడ కొంతమంది డ్రగ్స్ తయారీ చేసి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న సమయంలో పట్టు-కున్నామని వివరించారు. ప్రభుత్వ పరువు పెంచే విధంగానే వ్యవహరించాలని, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే చర్యలను సహించబోమని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. ఎవరైనా తప్పు చేసినా వదిలేది లేదని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# కుమ్రం భీమ్ జిల్లాలో విషాదం

## కుంటలో పడి తల్లీ ముగ్గురు పిల్లల దుర్మరణం

కొమురంభీం,సెప్టెంబర్13(సమయజ్యోతి):

వాంకిడి మండలం డాబా గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ నీటిగుంతలో పడి తల్లి, ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతిచెందిన వారిని మోర్లే బుజ్జి బాయి (35), మోర్లే గన్ను(12), వాడే మహేశ్వరీ(9), అదే శశిక(9)గా గుర్తించారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుకొని, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మోర్లే బుజ్జి బాయి అనే మహిళ పొలం వద్ద పనిచేస్తున్న సమయంలో నీటి కోసం ముగ్గురు పిల్లలు కుంటలో దిగారు. కుంటలో లోతు ఎక్కువగా ఉండటంతో.. చిన్నారులు నీటిలో మునిగిపోయారు. అది గమనించిన మహిళ చిన్నారులను రక్షించేందుకు నీటిగుంతలోకి దిగింది. గుంతలో నీరు, బురద ఎక్కువగా ఉండటంతో నలుగురు నీటిగుంతలోనే చిక్కుకుని మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు- పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# రేణు అగర్వాల్ హత్య కేసులో పురోగతి

## ఇద్దను నిందితులను పట్టుకున్న పోలీసులు

## పనికి పెట్టుకునే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్న కమిషనర్

హైదరాబాద్,సెప్టెంబర్13(సమయజ్యోతి):

నగరంలో సంచలనం సృష్టించిన కూకట్‌పల్లిలో రేణు అగర్వాల్ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు- పోలీసులు తెలిపారు. నిందితులను రాంచీలో పట్టుకున్నట్లు- వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి మీడియాకు వివరించారు. హత్య అనంతరం నిందితులు క్యాబ్‌లో రాంచీకి పరారైనట్లు చెప్పారు. హఫీజ్‌పేట నుంచి సికింద్రాబాద్ వెళ్లి అక్కడి నుంచి రైలులో రాంచీకి వెళ్దామనుకున్నారనీ.. అయితే అక్కడ పోలీసుల కదిలికలు చూసి క్యాబ్ తీసుకుని పరారయ్యారని వివరించారు. ఈ హత్యక్రమంలో సిపి పలు సూచనలు చేశారు. ఇంట్లో ఎవరినైనా ఇంట్లో పనికి పెట్టుకునే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సూచించారు. వారి నేపథ్యం గురించి ఆరా తీయాలని పేర్కొన్నారు. మొత్తం 7 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారని చెప్పారు. రోల్డ్ గోల్డ్ నగలు చూసి ఇంట్లో భారీగా బంగారం ఉందని నిందితులు భావించారని తెలిపారు. కూకట్‌పల్లిలో రేణు అగర్వాల్ దారుణ హత్యకు గురయ్యారు. ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్న యువకుడు.. మరొకరు కలిసి ఆమెను చేతులు, కాళ్లు తాళ్లతో కట్టేసి.. చిత్రహింసలు పెడుతూ.. తలపై కుక్కర్‌తో కొట్టి హత్య చేశారు. నగదు, బంగారం దోచుకెళ్లారు. హత్య చేశాక.. అదే ఇంట్లో తాపీగా స్నానం చేసి.. యజమానికి చెందిన ద్విచక్ర వాహనంపైనే పరారయ్యారు. కూకట్‌పల్లిలోని స్వాన్ లేక్ గేటెడ్ కమ్యూనిటీలో బుధవారం సాయంత్రం ఈ దారుణం చోటుచేసుకుంది. దీనిని సవాల్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకున్నారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఎందుకు మాట్లాడాలి

## కెటిఆర్ విమర్శలపై మండిపడ్డ పిసిసి చీఫ్

హైదరాబాద్,సెప్టెంబర్13(సమయజ్యోతి):

ఓట్ చోరీ గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధారాలతో నిరూపించారని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా దీనిపై ఉద్యమిస్తున్న వేళ రాహుల్‌కు మద్దతు పెరిగిందని అన్నారు. మోడీ ఈ విషయంలో అడ్డంగా దొరికారని అన్నారు. ఓ జాతీయ అంశంపై పోరాటం చేస్తుంటే..బిఆర్ఎస్ ఎమ్మెల్యేల గురించి రాహుల్ ఎందుకు మాట్లాడాని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం సిబిఐకి అప్పజెప్పినా కేంద్రంలో ఎందుకు కదలిక లేదని అన్నారు. ఫార్ములా- ఈ కార్ రేసు కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కు జైలు ఖాయం అని అన్నారు. ఢిల్లీలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హరీష్ రావు, కెటిఆర్, నరేంద్ర మోడిని కలిశారని తెలియజేశారు. వాళ్లు బిజెపిలో చేరినట్లు- తాము కూడా నోటీసులు పంపిస్తామని, సిఎంగా రేవంత్ రెడ్డిని అందరూ కలుస్తారని మహేష్ పేర్కొన్నారు. ఫిరాయింపులపై రాహుల్ స్పందించాలని కెటిఆర్ అంటున్నారని చెప్పారు. రాహుల్ పై మాట్లాడే అర్హత కెటిఆర్ కు ఉందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ తప్పించుకోవడానికే.. ఉపరాష్ట్రపతి ఎన్నికకు బిఆర్ఎస్ దూరంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# ఇంటర్ బోర్డు భూముల ఆక్రమణ ఆక్రమణలు కూల్చేసిన హైడ్రా

హైదరాబాద్ద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధి సర్వే నంబర్ 217లోని 12 ఎకరాల భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను హైడ్రా (అధికారులు కూల్చివేశారు. 2011లో ఈ భూములను బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియట్‌కు ప్రభుత్వం కేటాయించింది. వీటిని ఇటీవల ఓ నిర్మాణ సంస్థ కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టింది. ఈక్రమంలో ఫిర్యాదు అందుకున్న హైడ్రా చర్యలు తీసుకుంది. శనివారం పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. యూరియా కోసం రైతుల పోరాటం

# బీబీపేటలో పోలీస్ స్టేషన్‌లో టోకెన్ల పంపిణీ

కామారెడ్డి,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎదుట శనివారం యూరియా కోసం రైతుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. వందల మంది రైతులు ఒకేసారి పంపిణీ కేంద్రానికి వచ్చారు. వారిని పోలీసులు అదుపు చేయలేకపోయారు. ఒక దశలో పోలీసులపైనా అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి.. పోలీసుల సమక్షంలో టోకెన్లు అందజేశారు. అనంతరం పీఏసీఎస్ వద్ద 930 యూరియా బస్తాలను రైతులకు అందించారు. పోలీస్ స్టేషన్ వద్ద టోకెన్లు తీసుకునే సమయంలో మల్కాపూర్‌కు చెందిన రైతు అంబల్ల చిన్నరేకయ్య ఫిట్స్ వచ్చి పడిపోవడంతో ఆందోళన నెలకొంది. ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఆయన కోలుకున్నట్లు- స్థానికులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు రప్పించి టోకెన్లు ఇవ్వడం ఏంటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని అదుపులోకి తేవడానికి తాము పోలీస్ స్టేషన్‌కు రప్పించామని పోలీసులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. మెదక్ జిల్లా చేగుంటలోని రైతు వేదిక వద్ద వర్షంలో సైతం అన్నదాతలు బారులు తీరారు. చేగుంట రైతు వేదికకు 1500 వందల యూరియా బస్తాలు వచ్చాయన్న సమాచారంతో రైతులు భారీగా తరలివచ్చారు. తిండీతిప్పలు మాని యూరియా కోసం వస్తే.. ఒకే బస్తా ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్పందించి రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# యూపిపిఎస్సీ తరహాలో జాబ్ క్యాలెంటర్ బిజెపి అద్యక్షుడు రామ్ డిమాండ్

హైదరాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

యుపిఎస్‌సి తరహాలో రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ (టిజిపిఎస్‌సి) కూడా జాబ్ క్యాలెండర్ రూపొందించి ప్రతి ఏడాది పరీక్షలు నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్షకు దిగక ముందే నోటిఫికేషన్ల విషయంలో స్పష్టత ఇవ్వాలని ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. గ్రూపు 1, గ్రూపు 2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. వేలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్, అశోక్ నగర్ లైబ్రరీ వద్ద,అఫ్జల్‌గంజ్ లైబ్రరీ వద్ద ఇంకా వివిధ ఇనిస్టిట్యూట్స్ వద్ద రాత్రింభవళ్ళు చదువుతూ ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారని ఆయన తెలిపారు. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగులకు అన్యాయం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తున్నదని ఆయన విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం, 70 వేల ఉద్యోగాలు ఇచ్చామంటూ మాటలు చెప్పడమే తప్ప నియామకాలకు సంబంధించి లెక్కలు చూపించడం లేదని ఆయన విమర్శించారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ఆ ప్రకారం నియామకాలు చేపట్టాలని రాంచందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నగరంలో పలుచోట్ల వర్షం

హైదరాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు- ప్రాంతాలు నీట మునిగే పరిస్థితికి చేరుకున్నాయి. నగరంలో కొన్ని గంటల నుంచి నిరంతరాయంగా కురుస్తున్న వర్షంతో రహదారులపై నీరు చేరింది. ఆఫీసు నుంచి ఇళ్లకు వెళ్లే టైం కావడంతో వాహనదారుల ఇక్కట్లు- పడుతున్నారు. రాగల రెండు గంటల్లో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు- వాతావరణ శాఖ హెచ్చరించింది. నగరంలోని సికింద్రాబాద్, బేగంపేట్, రసూల్‌పుర, సోమాజిగూడ, మల్కాజ్‌గిరి, కంటోన్మెంట్, తిరుమలగిరి, అల్వాల్‌లో వర్షం కురుస్తోంది. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. ఈ మేరకు నగరవాసులు అప్రమత్తంగా ఉండాలంటూ.. జీహెచ్ఎంసీ హెచ్చరికలు జారీ చేసింది. కాగా, జీహెచ్ఎంసీ, హైడ్రా మాన్సూన్ బృందాలు సహాయక చర్యలకు సిద్ధం అవుతున్నాయి. నగరంలో ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొన్నారు.

# పాడుబడ్డ పాఠశాలలో మత్తుపదార్థాల తయారీ

## దాడిచేసి పట్టుకున్న ఈగిల్ టీమ్

హైదరాబాద్,సెప్టెంబర్13(సమయజ్యోతి):

మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు- చేసిన ఈగల్ టీమ్ మరో భారీ మత్తు పదార్థాల రాకెట్ గుట్టును రట్టు చేసింది. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో మత్తు పదార్థాల తయారీ కేంద్రంపై దాడి చేసింది. పాత పాఠశాల భవనంలో ఆల్ఫాజోలం అనే మత్తు పదార్థాన్ని తయారు చేస్తున్న ముఠాను ఈగల్ టీమ్ పట్టుకుంది. మత్తు మందు తరలిస్తుండగా.. నలుగురు సభ్యులతో కూడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. పాఠశాల నుంచే వీరంతా దందా కొనసాగిస్తు న్నారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో రూ.కోటి విలువైన 7 కిలోల అల్ఫాజోలం, అల్ఫాజోలం తయారు చేసే యంత్రాలు, ముడి సరకును స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు- రూ.20 లక్షల నగదు, కల్లులో కలిపే పౌడర్‌ని కూడా సీజ్ చేశారు.

# ల్యాండ్ సెటిల్‌మెంట్‌లో తేడాలు

## రియల్టర్ శ్రీకాంత్ రెడ్డి

## హత్యపై పోలీసులు

హైదరాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

కుషాయిగూడ రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీకాంత్ రెడ్డి హత్య కేసులో వెలుగులోకి సంచలన విషయాలు వస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన విషయాలను కుషాయిగూడ పోలీసులు శనివారం మీడియాకు వెల్లడించారు. వ్యాపారి శ్రీకాంత్ రెడ్డి రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. శాంతినగర్, లాలాపేట్ ప్రాంతాల్లో ఆయన వ్యాపారం చేస్తున్నాడు. అయితే, లాలాపేట్‌కు చెందిన డానియల్, ధన్‌రాజ్‌లను బౌన్సర్లుగా పెట్టుకున్నాడు . వీరిద్దరిపైనా లాలాపేట్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్లు- ఉన్నాయి. భోగారంలో ఓ భూమి విషయంపై శ్రీకాంత్ రెడ్డి డీల్ చేస్తున్నాడు. అందులో సహాయం చేసినందుకు డానియల్, ధన్‌రాజ్‌కు ఒక్కొక్కరికి రూ. కోటి ఇస్తానని ఆయన హామీ ఇచ్చాడు. కానీ డబ్బు ఇవ్వకుండా జాప్యం చేశాడు శ్రీకాంత్ రెడ్డి. ఆయనను తొలగించి ల్యాండ్ సెటిల్‌మెంట్‌ను చేసి డబ్బులు తామే తీసుకోవాలని నిందితులు ప్లాన్ చేశారు. గతంలో ధనరాజు ప్రవర్తన నచ్చకపోవడంతో పనిలో నుంచి తీసేశాడు శ్రీకాంత్ రెడ్డి. అయితే, మళ్లీ తిరిగి కొద్దిరోజుల క్రితమే ధనరాజును పనిలో చేర్చుకున్నాడు శ్రీకాంత్ రెడ్డి. వ్యక్తిగత గొడవలు, ల్యాండ్ సెటిల్‌మెంట్ విషయంలో కక్ష పెంచుకున్నాడు ధనరాజ్. ఈ క్రమంలోనే శ్రీకాంత్ రెడ్డిని నిందితులు హత్య చేసినట్లు కుషాయిగూడ పోలీసులు అనుమానిస్తున్నారు.

# బోధన్ ఎస్‌బిఐలో క్యాష్ చోరీ

## సిసి పుటేజీ ఆధారంగా బాలుడు చేసినట్లు గుర్తింపు

నిజామాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

చిన్న పిల్లలను ఉపయోగించుకుని నేరాలు చేయించే వ్యక్తులను మనం సినిమాల్లో చూస్తుంటాం. చిన్న పిల్లలకు ఒక పని అప్పజెప్పి వెనకాల నుంచి గమనిస్తూ ఉంటారు కేటుగాళ్లు. దీనిలో అసలు విషయం ఏంటంటే.. ఆ బాలుడు నేరం చేసేటప్పుడు దొరికిపోయినా గమనిస్తున్న వాడు మాత్రం పరార్ అయిపోవచ్చు. ఒకవేళ బాలుడే పట్టుబడి మైనర్ అయితే.. జైలు శిక్షకు బదులుగా జ్యువైనల్ హోమ్‌కి పంపిస్తారనే విషయం నిందితులకు బాగా తెలుసు. ఇదే అదునుగా చిన్నారులతో నేరాలు చేయించే అనేక సీన్లు సినిమాల్లో దర్శనమిస్తుంటాయి. తాజాగా అలాంటి ఘటనే ఒకటి బోధన్ లో వెలుగు చూసింది. నిజామాబాద్ జిల్లా బోధన్ భారతీయ స్టేట్ బ్యాంకులో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 8వ తేదీన బ్యాంకులో రూ.5లక్షలు చోరీకి గురైనట్లు- బ్యాంక్ అధికారి నాగనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో సీసీ పుటేజీలను పరిశీలించగా.. ఓ 12 ఏళ్ల బాలుడు క్యాష్ కౌంటర్ వైపు వెళ్లి చోరీ చేసినట్లు-గుర్తించారు. బాలుడు చోరీ చేసే సమయంలో మరో ఇద్దరు అతనికి సహకరించినట్లు-పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. అన్ని కోణాల్లో విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని వెల్లడించారు.

# యూరియా బాధలు పట్టించుకోని రేవంత్ సర్కార్

## మండిపడ్డ మాజీమంత్రి ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):

రైతులు యూరియా కోసం విపరీతమైన ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దీనిపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వరి పొట్ట దశలో ఉంది. వారం రోజుల్లో యూరియా రాకపోతే రైతుల దిగుబడి తీవ్రంగా పడిపోతుంది. రైతు ప్రభుత్వం అంటూనే రైతులను ముంచుతున్నారని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డి మాటలు బుడ్డ ర్ ఖాన్ మాటల్లా ఉన్నాయి. అబద్ధపు హామీలే తప్ప రైతులకు ఎలాంటి సహాయం చేయడం లేదు. కేసీఆర్, కేటీఆర్‌లను జైలుకు పంపించాలన్న ఆలోచన తప్ప రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు.



రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా ఆయన విమర్శలు చేశారు. రెండు లక్షల 20 వేల కోట్ల అప్పులు చేసి రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా పూడ్చలేదు. నాలుగు లక్షల కోట్లతో ఎక్కడైనా ఒక్క ప్రాజెక్ట్ కట్టావా? ఒక బ్రిడ్జ్ అయినా కట్టావా? అని ప్రశ్నించారు. రైతులకు వెంటనే యూరియా సరఫరా చేయాలని, లేకుంటే రైతులతో పాటు- మహిళలను తీసుకుని ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. 'కబర్దార్... ఇక మౌనంగా ఉండం' అని ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పహల్గాం దాడిని అప్పుడే మర్చారా?

## పాక్‌తో మ్యాచ్ ఆడడంపై బాధితుల ఆందోళన

**న్యూఢిల్లీ,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

ఆసియాకప్‌లో భాగంగా ఆదివారం భారత్, పాకిస్థాన్‌ల మధ్య మ్యాచ్ జరుగనుంది. అయితే పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్ ఆడవద్దని అంటూ పెద్ద ఎత్తున డిమాండ్లు వచ్చాయి. చివరకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మ్యాచ్ ఆడుతామని బిసిసిఐ ప్రకటించింది. ఈ విషయాన్ని ఐసిసితో పాటు–, ఎసిసి కూడా అంగీకరించాయి. అయితే పహల్గాం దాడి బాధితురాలు ఐషాన్య ద్వివేది ఈ విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు క్రికెటర్లకు ఈ మ్యాచ్ ఆడటం ఇష్టం లేదని.. కానీ బిసిసిఐ వాళ్లపై ఒత్తిడి తెస్తోందని వ్యాఖ్యనించారు. అసలు మ్యాచ్‌కి బిసిసిఐ ఒప్పుకోకుండా ఉండడాల్సిందని పేర్కొన్నారు. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి త్యాగాలను బిసిసిఐ విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలను కోల్పోయిన వారి కుటుంబసభ్యుల ఆవేదన అప్పుడే మర్చిపోయారా? అని స్పాన్సర్లు, క్రికెటర్లను ప్రశ్నించారు. ఈ మ్యాచ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని మళ్లీ ఆ దేశం ఉగ్రవాదులకు పోషించడానకే ఉపయోగిస్తుందని మండిపడ్డారు. మనపై దాడి మనమే వాళ్లను ప్రోత్సాహించినట్లు– అవుతుందని అన్నారు. దేశ ప్రజలంతా కలసి మ్యాచ్‌ను వీక్షించకుండా బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

# నేపాల్ ప్రధాని సుశీల కర్కికి మోడీ అభినందనలు

**ఇంఫాల్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

నేపాల్ తొలి మహిళా ప్రధానమంత్రిగా నియమితులైన సుశీల కర్కి కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఆమె నియామకం మహిళా సాధికారతకు ఒక ఉజ్వల ఉదాహరణ అని అన్నారు. నేపాల్ భారత్‌కు సన్నిహిత దేశమని, 140 కోట్ల భారత ప్రజానీకం తరపున ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నానని మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మాట్లాడుతూ ప్రధాని అన్నారు.

# హైదరాబాద్ మెట్రోలో యువకుడి అసభ్యత

## వైరల్‌గా మారిన సోషల్ మీడియా వీడియో

**హైదరాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

మెట్రోలో ఓ యువకుడు అసభ్యకరమైన పని చేసిన సంఘటన కలకలం రేపింది. రద్దీగా ఉన్న మెట్రో బోగీలోకి ఓ యువకుడు ఎక్కి, ప్యాంట్ జిప్ తీసి ఓ యువతిని వెనుక నుంచి తాకుతూ శునకానందం పొందాడు. పక్కనున్న ఓ ప్రయాణికుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇది ఎప్పుడు, ఏ స్టేషన్ లో జరిగిందో తెలియాల్సి ఉంది, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. పబ్లిక్ లో ఇలా చేయడం చాలా అవమానకరమని మండిపడుతున్నారు. ఇలాంటి సంఘటనలు విదేశాలలో మాత్రమే జరిగేవని, ఇప్పుడు భారత్ లో జరగడం మన సంప్రదాయలకు ముప్పు వాటిళు తుందున్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# లోయర్ మానేర్ డ్యామ్‌లో వలకు చిక్కిన అరుదైన చేప

**కరీంనగర్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో లోయర్ మానేర్ డ్యామ్ లో వలకు అరుదైన భారీ చేప చిక్కింది. రామకృష్ణ కాలనీ గ్రామానికి చెందిన బోళ్ల భూమయ్య అనే మత్స్యకారుడు రోజువారి లాగే చేపలు పట్టేందుకు శనివారం ఉదయం మానేరు డ్యామ్ కు వెళ్ళాడు. ఈ క్రమంలో తన వలలు తీస్తుండగా ఎర్ర రంగులో ఉన్న వెరైటీ– చేప భారీ సైజులో కనిపించడంతో పైకి తీసి గమనించాడు. ఇట్లాంటి చేప ఇప్పటివరకు లోయర్ మానేరు రిజర్వాయర్ లో కనిపించలేదని మత్స్యకారులు తెలిపారు. ఇది ఉత్తర ప్రదేశ్ కు చెందిన చేపగా పలువురు చెబుతున్నారు. ఈ వెరైటీ– చేప చూసేందుకు గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.


# హైదరాబాద్ మెట్రోలో యువకుడి అసభ్యత

## వైరల్‌గా మారిన సోషల్ మీడియా వీడియో

**హైదరాబాద్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

మెట్రోలో ఓ యువకుడు అసభ్యకరమైన పని చేసిన సంఘటన కలకలం రేపింది. రద్దీగా ఉన్న మెట్రో బోగీలోకి ఓ యువకుడు ఎక్కి, ప్యాంట్ జిప్ తీసి ఓ యువతిని వెనుక నుంచి తాకుతూ శునకానందం పొందాడు. పక్కనున్న ఓ ప్రయాణికుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇది ఎప్పుడు, ఏ స్టేషన్ లో జరిగిందో తెలియాల్సి ఉంది, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. పబ్లిక్ లో ఇలా చేయడం చాలా అవమానకరమని మండిపడుతున్నారు. ఇలాంటి సంఘటనలు విదేశాలలో మాత్రమే జరిగేవని, ఇప్పుడు భారత్ లో జరగడం మన సంప్రదాయలకు ముప్పు వాటిళు తుందున్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# లోయర్ మానేర్ డ్యామ్‌లో వలకు చిక్కిన అరుదైన చేప

**కరీంనగర్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలో లోయర్ మానేర్ డ్యామ్ లో వలకు అరుదైన భారీ చేప చిక్కింది. రామకృష్ణ కాలనీ గ్రామానికి చెందిన బోళ్ల భూమయ్య అనే మత్స్యకారుడు రోజువారి లాగే చేపలు పట్టేందుకు శనివారం ఉదయం మానేరు డ్యామ్ కు వెళ్ళాడు. ఈ క్రమంలో తన వలలు తీస్తుండగా ఎర్ర రంగులో ఉన్న వెరైటీ– చేప భారీ సైజులో కనిపించడంతో పైకి తీసి గమనించాడు. ఇట్లాంటి చేప ఇప్పటివరకు లోయర్ మానేరు రిజర్వాయర్ లో కనిపించలేదని మత్స్యకారులు తెలిపారు. ఇది ఉత్తర ప్రదేశ్ కు చెందిన చేపగా పలువురు చెబుతున్నారు. ఈ వెరైటీ– చేప చూసేందుకు గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.


## 22 తరవాత సిమెంట్,నిర్మాణ సామాగ్రి

# ధరలు తగ్గుదల

–జిఎస్టీ సంస్కరణలతో ఔషధాల ధరలు తగ్గింపు–క్యాన్సర్ మందుల ధరలు తగ్గుదలతో ఊరట

–కార్లు, బైకుల ధరలు కూడా తగ్గిస్తూ ప్రకటనలు–భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందన్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలను తగ్గించాయని.. సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్ నిర్మాణ సామగ్రి కూడా చౌకగా మారతాయని ప్రధాని తెలిపారు. వివిధ హోటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈవిధంగా దేశంలోని అనేక కుటుంబాలపై భారం తగ్గించామంటూ వ్యాఖ్యానించారు. 2025–26 మొదటి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశం చేసే ఎగుమతుల్లో వృద్ధిని సాధించగలిగామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించారని ప్రధాని మండిపడ్డారు. 2014కి ముందు టూత్‌పేస్ట్, సబ్బు, నూనె వంటి రోజువారీ నిత్యావసర వస్తువులకు కూడా 27 శాతం పన్ను విధించేవారు. నేడు వీటిపై కేవలం 5శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తుంది. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించడం వల్ల సాధారణ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ చాలా ఖరీదైనదిగా మారిందని అన్నారు. మన ఆర్థికవ్యవస్థ తయారీ రంగం వృద్ధి మన జాతీయ భద్రతకు చాలా ముఖ్యమైనదన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో.. ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తున్న వారికి భారత సైన్యం ఎలా బుద్ధి చెప్పిందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాని మోదీ అన్నారు. మన సాయుధ దళాలు చూపిన తెగువకు దేశం మొత్తం గర్వపడిందన్నారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ ఆయుధాలే మన దేశాన్ని రక్షించడంలో ముఖ్య పాత్ర పోషించాయన్నారు. మణిపుర్‌లో జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ఆ రాష్ట్రంలో నేడు పర్యటించనున్నారు. దీనికి ముందు మిజోరంలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బైరాబి–సైరాంగ్ రైల్వేలైన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మిజోరం నుంచి చురాచంద్‌పుర్ చేరుకుంటారు.

# మిజోరంలో రూ.9వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు

–దేశాభివృద్ధిలో మిజోరం భాగస్వామ్యం కీలకం–యువత ఇందులో భాగస్వామ్యం కావాలి

–ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ

**గ్యాంగ్‌టక్,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

దేశాభివృద్ధిలో మిజోరం భాగస్వామ్యం కీలకమని ప్రధాని మోడీ తెలిపారు. కొండమార్గంలో రైలు మార్గం కష్టతరంలో కూడుకున్నదని, సవాల్‌తో కూడిన నిర్మాణాలు అద్భుతమని కొనియాడారు. మిజోరంలో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. వర్చువల్‌గా అభివృద్ధి పనులను పిఎం మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఈ రైల్వే లైన్లు భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానమవుతాయని, పర్యాటక రంగంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని తెలియజేశారు. ఏ రాష్ట్రాభివృద్ధికైనా రోడ్లు, రైల్వే, పోరు కనెక్టివిటీ– ముఖ్యమని స్పష్టం చేశారు. మిజోరం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, వేగవంతమైన దేశాభివృద్ధిలో మిజోరం యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మిజోరంలో రవాణా సౌకర్యాలు పెంచామని, నూతన రైళ్ల ప్రారంభోత్సవంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని మోడీ వివరించారు. కష్టతరమైన కొండ ప్రాంతాల్లో రైల్వే సౌకర్యం సంతోషకరమైన విషయమన్నారు. ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల స్ఫూర్తి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిందని ప్రశంసించారు. కఠినమైన భూభాగంతో అనేక సవాళ్లను అధిగమించి నిర్మాణం

# మోసగాడిపై కేసు నమోదు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

డబ్బులు ఇస్తానని నమ్మబలికి సుమారు 15 లక్షల విలువైన అదనంగా 16 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని, అనంతరం డబ్బులు ఇవ్వనని మొండికేసిన హైదరాబాద్ కు చెందిన ఈ.స్వామి అనే వ్యక్తిపై కొండాపూర్ రైతు మంద మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు శనివారము ఎస్సై సిహెచ్ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు.



## పాలమూరు జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో- కోఆర్డినేటర్ గా గోవర్ధన్ యాదవ్ నియామకం

**దేవరకద్ర,దేశ్ వాణి సెప్టెంబర్ 13**

మహబూబ్ నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో–కోఆర్డినేటర్ గా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాయపల్లి గ్రామానికి చెందిన గోవర్ధన్ నాయిని శనివారం పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా గోవర్ధన్ నాయి మాట్లాడుతూ తనను జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో–కోఆర్డినేటర్ గా నియమించినందుకు పార్టీ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు పాటు పడతానన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,టి పి సి సి అధ్యక్షులు,ఎం ఎల్ సి బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి మహబూబ్ నగర్ జిల్లా డిసిసి అధ్యక్షులు, దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కు గోవర్ధన్ నాయి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. అలాగే రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ శివాంత్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్ అహ్మద్, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు.కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాననిమహబూబ్ నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో – కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయి అన్నారు.



# కేటీఆర్ కు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు

**దేవరకద్ర, దేశ్ వాణి సెప్టెంబర్ 13**

బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట వద్ద శనివారం బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. చలో గద్వాల్ గర్జన బహిరంగ సభకు వెళుతున్న కేటీఆర్ కు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ కు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. చాలామంది పార్టీ నాయకులు, కార్యకర్తలు కేటీఆర్ తో కరచాలనం చేయడానికి పోటీపడ్డారు. మరి కొంతమంది సెల్ఫీలు దిగారు కేటీఆర్ రాక సందర్భంగా బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కింది రాష్ట్రాలకే మిగులు జలాల హక్కు

## విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

**గుంటూరు,సెప్టెంబర్13(సమయజ్యోతి):**

మిగులు జలాలలను కింది రాష్ట్రాలు ఉపయోగించుకునే హక్కు ఉందని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. గోదావరి మిగులు జలాలను ఉపయోగించుకునే హక్కు ముమ్మాటికీ ఎపికి ఉందన్నారు. ఉమ్మడి ఏపీలో కోస్తాంధ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆయన అన్నారు. గుంటూరు బాలానంద కేంద్రంలో ఆలోచనపరుల వేదిక ఆధ్వర్యంలో 'నదీ జలాల హక్కుల పరిరక్షణ, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో హైదరాబాద్ కేంద్రీకృతంగా అభివృద్ధి కోసం నిధులు ఖర్చు చేశారన్నారు. గత 40 ఏళ్లలో ఒక్క భారీ సాగునీటి ప్రాజెక్టు కూడా కోస్తాంధ్రకు రాలేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం దశాబ్దాలుగా జరుగుతూనే ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు డిజైన్లు, నిర్మాణం అంతా రైతుల అవసరాల కోసమే జరగాలని చెప్పారు. మిగులు జలాలు వాడుకునే హక్కు చివరి రాష్ట్రం ఏపీకి ఉంది. ఒక బేసిన్‌నుంచి మరో బేసిన్‌కు నీరు తరలించుకోవచ్చు.ఈ విషయాలు బచావత్ ట్రైబ్యునల్ గతంలో స్పష్టం చేసింది. కానీ తెలంగాణ అనవసర రాద్ధాంతం చేసి మిగులు జలాలపై అసత్య ప్రచారం చేస్తోంది. దీన్ని సాకుగా చూపి తెలంగాణ అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తోందని ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. కింద సముద్రంలోకి పోతున్న జలాలపై పేచీ పెట్టడం సరికాదన్నారు. బనకచర్ల పేరుతో ఇటీవల చంద్రబాబునాయుడు కొత్త ప్రతిపాదన తేగా తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఇప్పుడు దీనిని బలంగా ముందుకు తీసుకుని వెళ్లే క్రమంలో ఈ ప్రతిపాదనలపై వివిధ వేదికల ద్వారా ప్రచారం చేయిస్తున్నట్లు అర్థం అవుతోంది.

# ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేం

## జగన్‌కు దమ్ముంటే మెడికల్ టెండర్లలో పాల్గొనాలి

## కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సవాల్

**గుంటూరు,సెప్టెంబర్13(సమయజ్యోతి):**



ప్రజలను జగన్ ఎప్పుడో ఒకసారి మోసం చేయొచ్చు.. కానీ ప్రతిసారి మోసం చేయలేరని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. గుంటూరు, రాజధాని ప్రజలు బాగా తెలివిగల వారని పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు. ఐదేళ్ల పాలనో ప్రజలనో మభ్య పెట్టారని, రాష్ట్రాన్ని దోచుకున్నారని అన్నారు. ఇంవతకన్నా దారుణం ఉంటుందా అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సవాల్ విసిరారు. జగన్‌కు చేతనైతే మెడికల్ కళాశాలల్లో టెండర్లు పాడుకొని.. అభివృద్ధి చేయాలని ఛాలెంజ్ విసిరారు. శనివారం గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలను పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నజీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడారు. ఎవరికీ అధికారం ఇవ్వాలో ప్రజలకు బాగా తెలుసునని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో ఎయిమ్స్‌కు నీళ్లు, రోడ్లు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ మహిళా కళాశాలను కూడా కాపాడలేని అసమర్థత జగన్ ప్రభుత్వానిదని విమర్శించారు. జగన్ ఇష్టానుసారంగా మాట్లాడటం చూస్తే నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు. టీ-డీపీ హయాంలోనే మెడికల్ కళాశాలకు అనుమతి తీసుకున్నామని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు జగన్ ఏదో తానే కష్టపడి తెచ్చినట్లు- మాట్లాడటం చూస్తుంటే విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సె-టైర్లు గుప్పించారు.

# బి ఫార్మసి విద్యార్థి మైథిలిప్రియ దారుణ హత్య

## రూమ్‌కు పిలిచి కత్తితో పొడిచిన స్నేహితుడు నిఖిల్

**నెల్లూరు,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

నెల్లూరులో అమానుష ఘటన చోటుచేసుకుంది. కరెంట్ ఆఫీసు సెంటర్ వద్ద బీఫార్మసీ విద్యార్థిని మైథిలి ప్రియ దారుణ హత్యకు గురైంది. ఇటీవల బీఫార్మసీ ఫైనల్ ఇయర్ పూర్తిచేసింది మైథిలిప్రియ. ఆమెతో మాట్లాడాలని స్నేహితుడు నిఖిల్ రూమ్‌కి పిలిచి, కత్తితో పొడిచి చంపేశాడు. అయితే, మైథిలిప్రియ ప్రేమకు నిరాకరించినందుకే నిందితుడు హతమార్చి ఉంటాడని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేశారు. యువతిని హత్యచేసిన అనంతరం పోలీసు స్టేషన్‌లో నిందితుడు నిఖిల్ లొంగిపోయాడు. మైథిలిప్రియ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కి తరలించారు. మైథిలిప్రియ మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నిందితుడు నిఖిల్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

# వైసిపి సీనియర్ నేత తోపుదుర్తి

## భాస్కర్ రెడ్డి హఠాన్మరణం

**అనంతపురం,సెప్టెంబరు13 (సమయజ్యోతి):**

వైసీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి(70) మృతి చెందారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తిలోని పొలంలో పనులు చేయిస్తుండగా ఈ సంఘటన చోటు-చేసుకుంది. ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో కింద పడిపోయారు. వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. భాస్కర్‌రెడ్డి సుదీర్ఘ కాలం కాంగ్రెస్ ఆత్మకూరు మండల ఎంపీపీగా పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి సతీమణి తోపుదుర్తి కవిత జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. వైపీసీ ఆవిర్భావం తర్వాత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి దంపతులు ఆ పార్టీలో చేరారు. భాస్కర్‌రెడ్డి మృతదేహాన్ని నగరంలోని రామచంద్రనగర్ లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నివాళి అర్పించారు. భాస్కర్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ రంగయ్య, గంగుల భానుమతి, మధుసూదన్‌రెడ్డి తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కర్‌రెడ్డికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

# విశాఖ స్టీల్‌పై లెఫ్ట్ పార్టీల దుష్ప్రచారం

## -మూడు రాజధానుల పేరుతో జగన్ నాటకాలు-కూటమి ద్వారా ఎపిలో అభివృద్ధి పరుగులు

## -నేడు విశాకలో సారథ్య సమావేశానికి నడ్డా రాక-బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ వెల్లడి

**విశాఖపట్నం,సెప్టెంబర్13 (సమయజ్యోతి):**

గత జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో డ్రామాలు ఆడిందని,దీనిని ప్రజలు అప్పుడే ఎలా మరచిపోతారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి వ్యవహారించారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వం మైనార్టీల నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. శనివారం విశాఖ పట్నంలో పీవీఎన్ మాధవ్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడి యాతో మాధవ్ మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంతో పురోభివృద్ధి చెందుతోందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై వామపక్ష పార్టీల దుష్ప్రచారాన్ని నమ్మొద్దని అన్నారు. విశ్శాఖ ప్లాంట్‌కు ఎలాంటి ఢోకా లేదన్నారు. అమ్మడం అన్న పరిస్థితి లేకుండా ఆర్థిక సాయంతో కేంద్రం ఆదుకుందని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగు తున్నాయి. ఎన్డీఏ సారథ్యంలో పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుంది. అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రైవేటీకరణను ఒక భూతంలా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రైవేటీకరణ అనేది అన్ని దేశాల్లోనూ జరుగుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని మొదట కోరింది బీజేపీనే. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఏదో జరిగిపోతోందని కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారు. స్టీల్ ప్లాంట్ విషయంలో జరుగుతున్న మంచిని ఎందుకు బయటకు చెప్పడం లేదని పీవీఎన్ మాధవ్ ప్రశ్నల వర్షం కురిపించారు. విశాఖలో సారథ్యం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని... ఈ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. విశాఖలోని రైల్వే మైదాన వేదికలో ఈ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు పీవీఎన్ మాధవ్. సారథ్యం యాత్ర బహిరంగ సభలో బీజేపీలోని ప్రతి కార్యకర్తను భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. కడప నుంచి సారథ్యం యాత్ర ప్రారంభించామని గుర్తుచేశారు. సారథ్యం యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన వచ్చిందని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని స్ఫూర్తిగా తీసుకుని బీజేపీలోని ప్రతి కార్యకర్త పని చేయాలనే విధంగా సారథ్యం యాత్ర చేపట్టామని వెల్లడించారు. సారథ్యం



యాత్రలో వైతాలికులను గుర్తించి వారిని స్మరించుకున్నామని తెలిపారు. సారథ్యం యాత్రలో చాయ్ పై చర్చ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని పేర్కొన్నారు పీవీఎన్ మాధవ్. కేంద్ర ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందుతున్నాయి. అక్టోబర్ 2తేదీన ఏపీవ్యాప్తంగా ఖాదీ సంతలను నిర్వహిస్తాం. నెక్స్ట్ జనరేషన్ జీఎస్‌టీ సాహసోపేతమైన నిర్ణయం. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో అనేక రకాల వస్తువుల ధరలు తగ్గనున్నాయి. సెప్టెంబర్ 17వ తేదీన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విశాఖపట్నంలో పర్యటిస్తారు. అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ విజయవంతమైంది. విశాఖలో 'సారథ్యం' బహిరంగ సభను ఆదివారం నిర్వహించనున్నట్లు మాధవ్ తెలిపారు. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో పాటు-.. రాష్ట్ర నేతలు హాజరవుతున్నారు. విశాఖలోని రైల్వే మైదానం వేదిక ఈ సభ జరగనుంది. 'సారథ్యం' బహిరంగ సభలో విశాఖలోని పార్టీ ప్రతి కార్యకర్తను భాగస్వామ్యం చేస్తున్నట్లు- మాధవ్ తెలిపారు. కడప నుంచి సారథ్యం యాత్ర ప్రారంభించాం. రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన వచ్చింది. ఈ యాత్రలో చాయ్‌పే చర్చ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని మాధవ్ పేర్కొన్నారు.

# సుపరిపాలన వేళ వైషమ్యాల కుట్రలు

## -జనసైనికులు అప్రమత్తంగా ఉండాలి-డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పిలుపు

**అమరావతి,సెప్టెంబర్13(సమయజ్యోతి)**

రాష్ట్రం అభివృద్ధి దిశగా.. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్నామని అలాంటి వేళ ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకు కుట్రలు మొదలయ్యాయని డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ జనసేన పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. వారు చేసే దుష్ప్రచారాన్ని ప్రజాస్వామ్య యుతంగా, చట్ట ప్రకారం తిప్పికొడదామని పార్టీ శ్రేణులకు డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ పిలుపు నిచ్చారు. శనివారం అమరావతిలోని పార్టీ కార్యాలయంలో జనసేన శ్రేణులను ఉద్దేశించి డిప్యూటీ-సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల ముసుగులోనో.. యూట్యూబ్ ఛానెళ్ల పేరుతోనో.. మరో మార్గంలోనో కులాలు మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా కుయుక్తులతో సమాజంలో అశాంతి, అభద్రత కలిగించే వ్యక్తుల నైజాన్ని గత పదేళ్లుగా చూస్తున్నామని ఆయన వివరించారు. వారి ఉచ్చులో పడి, ఆవేశాలకు లోనై, ఘర్షణ వాతావరణానికి తావీయ వద్దంటూ పార్టీ శ్రేణులకు ఆయన హితవు పలికారు. అలాంటి ఆవేశాలు ప్రదర్శిస్తే కుట్రదారులు ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయన్నారు. ఆ క్రమంలో ఇటీ-వల మచిలీపట్నంలో చోటు- చేసుకున్న ఘటనను ఈ సందర్భంగా ఆయన ఉదాహరణగా వివరించారు. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో వ్యక్తి అభ్యంతరకర భాష ఉపయోగించి మాట్లాడారని చెప్పారు. అతను ఆ విధంగా మాట్లాడేలా సిద్ధం చేసి.. ప్రచారం చేయడం వెనక ఉన్న కుత్సిత ఆలోచనను మనం పసిగట్టాల్సి ఉందని పార్టీ శ్రేణులకు డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఈ అంశంపై చట్ట ప్రకారం కేసులు పెట్టి ముందుకు వెళ్ళాల్సి ఉందని సూచించారు. అంతేకానీ.. తొందరపడి మరో మార్గంలో వెళ్ళి ఘర్షణ పడటం ద్వారా సమస్య జటిలం అవుతుందని అభిప్రాయ పడ్డారు. కులాలు, మతాల మధ్య విభేదాలు తీసుకు వచ్చే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాల్సి ఉందంటూ పార్టీ శ్రేణులకు ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా ముందుకు వెళ్ళాలని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలతోపాటు- కూమిటీ-లోని నేతలను సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. సోషల్ మీడియా, యూట్యూబ్ చానెల్స్ రూపంలోనో, విశ్లేషకుల ముసుగులోనో రెచ్చగొట్టే వారినీ, అభ్యంతరకర రీతిలో మాట్లాడే వారినీ భారత న్యాయ సంహిత ప్రకారం చట్టం ముందు నిలపాలని పేర్కొన్నారు. వీరి వెనక ఉండి.. వ్యవస్థీకృతంగా రెచ్చగొట్టి కుట్రలు చేసే వారిపైనా ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించాలని పార్టీ కేడర్‌కు ఆయన సూచించారు. అయితే మచిలీపట్నం వివాదంపై అంతర్గత విచారణ జరపాలంటూ ఇప్పటికే పార్టీలోని నేతలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని వెల్లడించారు. ఈ ఘటనలో పాలు పంచుకున్న వారికి నోటీ-సులు ఇచ్చి వివరణ తీసుకోవాలని కూడా ఇచ్చానని



వివరించారు. కుట్రలు చేసే వారి కుత్సిత నైజం కలిగిన పార్టీ, ఆ పార్టీ నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ముసుగులో అనుసరిస్తున్న వైఖరిపై జనసేన పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ అప్రమత్తం చేశారు.

# అమరావతిపై నాలుక మడత మాటలు

## -ఆనాడు మూడుముక్కలాట ఆడింది వారే-ఇప్పుడు మాట మార్చిమాట్లాడిందీ వారే

## -వైకాపా తీరు మారకుంటే 11 సీట్లు కూడా రావు-డయేరియా మరణాల వార్తలు అబద్ధం

## -మీడియా సమావేశంలో మంత్రి నారాయణ

**విజయవాడ,సెప్టెంబర్13 (సమయజ్యోతి):**

వైకాపా అధ్యక్షుడు జగన్‌కు రాజధానిపై స్పష్టత లేదని మంత్రి నారాయణ విమర్శించారు. గతంలో మూడు రాజధానులని ప్చారం చేసిన విషయం మరచిపోయి మాట్లాడుతున్నారని అన్నారు. ఆనాడు వైకాపా బాధ్యతతాయుతంగా పనిచేసి వుంటే ఇవాళ రాజధాని పూర్తి అయివుండేదన్నారు. విజయవాడ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజధానిపై వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. రాజధానికి 30వేల ఎకరాలు కావాలని అసెంబ్లీలో జగనే చెప్పారు. ఆ తర్వాత పొలిటికల్ గేమ్‌తో మూడు ముక్కలాట ఆడారు. ఏ పార్టీ అయినా.. ప్రజల అభిప్రాయం ప్రకారం రాజకీయం చేయాలి. అనంతపురం, శ్రీకాకుళానికి అమరావతి సెంటర్ పాయింట్‌లో ఉంది. అమరావతికి రైల్వే కనెక్టవిటీ-, పోర్టు, ఎయిర్ పోర్టు దగ్గరలోనే ఉన్నాయి. రాజధానిగా అమరావతిని అంగీకరించి అసెంబ్లీలో జగన్ కూడా చేతులెత్తారు. మళ్లీ ప్రభుత్వం రాగానే మాట మార్చారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అని.. మళ్లీ అధికారం కోసం అమరావతి అని మాట మార్చడం కరెక్ట్ కాదన్నారు. రాజధానిని అభాసుపాలు చేసిన ఘనత జగన్‌దని అన్నారు. ఇలా చేస్తే భవిష్యత్‌లో ప్రజలు ఆ 11 సీట్లు- కూడా ఇవ్వరు. గదిలో కూర్చొని నలుగురైదుగురు ఇచ్చే సలహాలు పాటించకూడదు. సజ్జల ఆ పార్టీలో సీనియర్‌నేత.. ఆయన చెబితే వైకాపా చెప్పినట్టే కదా. వారి పార్టీ అభిప్రాయమే ఆయన చెప్పారు. నేను మంత్రిగా మాట్లాడితే సీఎం చంద్రబాబు చెప్పినట్టే కదా. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. అమరావతి, విజయవాడ, మంగళగిరి, తెనాలి, గుంటూరు కలిపి భవిష్యత్తులో మహా నగరంగా చేయాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని మంత్రి నారాయణ వివరించారు. విజయవాడలోని న్యూరాజరాజేశ్వరిపేటలో డయేరియా మూలాలు ఎక్కడున్నాయో కనుక్కొనేందుకు దృష్టి పెట్టామని మంత్రి నారాయణ తెలిపారు. ఆర్ఆర్ పేటలో శనివారం ఆయన పర్యటించారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు- చేసిన డయేరియా మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. నూతన ప్రభుత్వాసుపత్రిలో బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఈ సాయంత్రం లేదా రేపు ఉదయానికి నీటి పరీక్షల నివేదికలు వస్తాయన్నారు. రిపోర్టులు వచ్చాక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డయేరియాకు కారణం తాగునీరా లేదా ఫుడ్ పాయిజన్ అన్నది స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే 15 వేల వాటర్ క్యాన్ల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నట్లు- తెలిపారు. ఇప్పటివరకు 150 మంది చికిత్స తీసుకుని ఇంటికెళ్లారని వివరించారు. డయేరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ప్రజలెవరూ వదంతులు నమ్మవద్దని సూచించారు.

# ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై తొలిసారి ఆడనున్న ఐదుగురు భారత ఆటగాళ్లు?

ఆపరేషన్ సిందూర్ తర్వాత, పాకిస్తాన్‌తో భారతదేశం పాల్గొనడంపై సందేహాలు తలెత్తడంతో, ఆసియా కప్ 2025 అనిశ్చితిని ఎదుర్కొంది. చివరికి, భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది, సెప్టెంబర్ 14న దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో అభిమానులు ఈ పోరును చూడబోతున్నారు. ఈ మ్యాచ్ కోసం ఇంకా టీమ్ ఇండియాను ప్రకటించలేదు. భారత జట్టులో ఐదుగురు ఆటగాళ్లు ఉన్నారు, వీరు పాకిస్తాన్‌తో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. సెప్టెంబర్ 14న జరిగే మ్యాచ్‌లో ఈ ఆటగాళ్లకు పాకిస్తాన్‌తో ఆడే అవకాశం లభించవచ్చు. భారత్, పాకిస్తాన్ మధ్య 2012-13 నుంచి ఎలాంటి ద్వైపాక్షిక సిరీస్ జరగలేదు. ఈ రెండు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌లు అంతర్జాతీయ, ఆసియా ఈవెంట్స్‌లో మాత్రమే జరుగుతాయి. దీని కారణంగా, భారత జట్టులో చేరిన యువ ఆటగాళ్లు ఇప్పటివరకు పాకిస్తాన్‌తో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ ఆటగాళ్లలో భారత ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అభిషేక్ శర్మ, వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ సంజు శాంసన్, జితేశ్ శర్మ పేర్లు ఉన్నాయి. వీరితో పాటు తిలక్ వర్మ, రింకు సింగ్ కూడా పాకిస్తాన్‌తో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. భారతదేశానికి చెందిన ఈ ఐదుగురు ఆటగాళ్లలో ముగ్గురికి ఆసియా కప్ మొదటి మ్యాచ్‌లో అవకాశం లభించింది. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజు శాంసన్ యూఏఈతో జరిగిన ప్లేయింగ్ ఎలెవన్ జట్టులో ఉన్నారు. ఒకవేళ టీమ్ ఇండియా పాకిస్తాన్‌తో జరిగే ప్లేయింగ్ ఎలెవన్ జట్టులో ఎలాంటి మార్పులు చేయకపోతే, ఈ ఆటగాళ్లు పాకిస్తాన్‌తో తమ కెరీర్‌లో తొలి మ్యాచ్ ఆడతారు. అదే సమయంలో రింకు సింగ్, జితేశ్ శర్మలు వేచి చూడాల్సి ఉంటుంది. పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లో భారత్ ప్లేయింగ్ ఎలెవన్‌ను సెప్టెంబర్ 14న మ్యాచ్‌కు ముందే ప్రకటించవచ్చు. ఆసియా కప్ 2025 టీ20



ఫార్మాట్‌లో జరుగుతోంది. అదే సమయంలో భారత జట్టులో శుభ్‌మన్ గిల్, కుల్దీప్ యాదవ్ ఇద్దరు ఆటగాళ్లు ఉన్నారు, వీరు పాకిస్తాన్‌తో %ాణ×% మ్యాచ్‌లు ఆడారు, కానీ టీ20లో ఇంతకు ముందు పాకిస్తాన్‌తో ఎప్పుడూ ఆడలేదు. సెప్టెంబర్ 14న గిల్, కుల్దీప్ పాకిస్తాన్‌తో తొలి టీ20 మ్యాచ్ ఆడవచ్చు. భారత స్పిన్నర్లు, ముఖ్యంగా కుల్దీప్ యాదవ్ , వరుణ్ చక్రవర్తి పాకిస్తాన్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌కు ఇబ్బంది పెడతారని వసీం అక్రమ్ హెచ్చరిస్తున్నారు. “పాకిస్తాన్ మిడిల్-ఆర్డర్ బ్యాటింగ్ భారత స్పిన్నర్లతో ఇబ్బంది పడుతుంది. జస్ప్రీత్ బుమ్రాను భయంకరంగా కనిపించవచ్చు కానీ, కానీ వరుణ్, కుల్దీప్ వంటి వారు బ్యాటర్లను ఇబ్బంది పెట్టవచ్చు. బంతి పిచ్ అయిన తర్వాత ఒక బ్యాటర్ బంతిని రీడ్ చేస్తున్నాడంటే ఏమి జరుగుతుందో తెలియదని అర్థం” అని చెప్పారు. పాకిస్తాన్ లాగానే భారతదేశం కూడా 2025 ఆసియా కప్‌లో ఒకే ఒక్క మ్యాచ్ ఆడినప్పటికీ, ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు కుల్దీప్ యాదవ్ ఎంత ఇబ్బందికరంగా ఉంటాడో చూపించడానికి ఇది సరిపోతుంది.భారత 11 ఇదే కావచ్చు: అభిషేక్ శర్మ - ఓపెనర్, శుభ్‌మన్ గిల్ - ఓపెనర్, తిలక్ వర్మ - బ్యాటర్, సూర్యకుమార్ యాదవ్ - బ్యాటర్, సంజు సామ్సన్ - కీపర్-బ్యాటర్, హార్దిక్ పాండ్యా - ఆల్ రౌండర్, శివమ్ దూబ్టే - ఆల్ రౌండర్, అక్షర్ పటేల్ - స్పిన్నర్, వరుణ్ చక్రవర్తి - స్పిన్నర్, కుల్దీప్ యాదవ్ - స్పిన్నర్ , జస్ప్రీత్ బుమ్రా - పేసర్.బెంచ్: అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, రింకు సింగ్, జితేష్ శర్మ.



## మ్యాచ్‌పైనే ఫోకస్ పెట్టండి

### టీమ్ఇండియా బ్యాటింగ్ కోచ్ సీతాన్షు

ఆసియా కప్‌లో భాగంగా దుబాయ్ వేదికగా ఆదివారం భారత్- పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందే వాతావరణం అంతటా వేడెక్కింది. ఈ ఏడాది ఏప్రిల్?లో పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ఇరుజట్లు తలపడడం ఇదే తొలిసారి. ఇప్పటికీ రెండు దేశాల మధ్య వివాదాలు సద్దుమణగలేదు. ఇలాంటి పరిస్థితిలో పాకిస్థాన్‌తో భారత్? క్రికెట్ ఆడకూడదని అనేక మంది అభిమానులు, నెటిజన్లు డిమాండ్ చేశారు. బాయ్?కాట్ అంటూ ట్రెండ్ కూడా చేస్తున్నారు. మరి ఈ నేపథ్యంలో టీమ్ఇండియా బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కోటక్ ఈ వ్యవహారంపై స్పందించాడు. టీమ్ఇండియా ప్లేయర్లు క్రికెట్‌పై మాత్రమే దృష్టి సారించాలని, మిగిలిన ఏ విషయాలను పట్టించుకోకూడదని బ్యాటింగ్ కోచ్ సీతాన్షు కోటక్ స్పష్టం చేశారు. “బీసీసీఐ ప్రభుత్వ నిర్ణయంతో పూర్తిగా ఏకీభవించింది. పాక్?తో మ్యాచ్ గురించి బోర్డు క్లారిటీ ఇచ్చినప్పటి నుంచీ మా దృష్టి మ్యాచ్‌పై మాత్రమే ఉంది. భారత్- పాక్? మ్యాచ్? ఎల్లప్పుడూ ఆసక్తికరమే. ప్లేయర్లు కూడా మైదానంలో ఆటపైనే మొత్తం ఫోకస్ పెట్టాలి. మిగతా విషయాలేవీ పట్టించుకోకూడదు” అని కోటక్ చెప్పారు. అనంతరం ఇరుజట్ల కెప్టెన్లూ దూకుడుగానే ఉంటామని అన్నారు. ఉగ్రదాడి తర్వాత తొలిసారి మ్యాచ్ ఉన్నందున సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అలాగే దీనిపై భిన్నమైన డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీనిపై కేంద్ర క్రీడా శాఖ మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్?ను కూడా మీడియా ప్రశ్నించింది. దీనికి ఆయన, ఆసియా క్రికెట్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ బోర్డులు నిర్వహించే టోర్నమెంట్లను బహిష్కరించలేమని అనురాగ్ ఠాకూర్ వివరించారు. “ఆసియా క్రికెట్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ బోర్డులు నిర్వహించే మల్టీనేషనల్ టోర్నమెంట్లలో మన మ్యాచుల్లో కచ్చితంగా పాల్గొనాలి. ఒకవేళ అలా ఆడకుండా తప్పుకుంటే, ఆ దేశాల జట్లను ఆ టోర్నీ నుంచి ఎలిమినేట్ చేస్తారు. అంతేకాదు మన ప్రత్యర్థి జట్టుకు పాయింట్లు ఇచ్చేస్తారు. అయితే టీమ్ఇండియా ఎట్టి పరిస్థితుల్లోనూ పాక్?తో ద్వైపాక్షిక సిరీస్?ల్లో ఆడదు. భారత్‌పై పాకిస్థాన్ ఉగ్రవాద దాడులు ఆపే వరకు టీమ్ఇండియా ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదని మేం ఎప్పుడో నిర్ణయం తీసుకున్నాం” అని ఠాకూర్ అన్నారు.కాగా, ఈ టోర్నీలో తొలి మ్యాచ్?లో యూఏఈపై భారీ విజయం సాధించిన యువ భారత్ జోష్?మీదుంది. అభిషేక్ శర్మ, శుబ్?మన్ గిల్, తిలక్ వర్మ, సంజు శాంసన్, సూర్య కుమార్, దూబే, రింకూ లాంటి ఆటగాళ్లతో టీమ్ఇండియా ఫుల్ స్ట్రాంగ్?గా ఉంది. బుమ్రా, కుల్దీప్, అక్షర్, వరుణ్ లాంటి ప్లేయర్లతో బౌలింగ్ లైనప్ కూడా బలంగా ఉంది. అన్ని విభాగాల్లో భారత్ పటిష్ఠంగా ఉంది.భారత్- పాక్ చివరిసారిగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో తలపడ్డాయి. ఈ మ్యాచ్?లో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 49.4 ఓవర్లలో 241 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో దిగిన భారత్ 42.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఛేజింగ్?లో విరాట్ కోహ్లీ (100బి పరుగులు) సెంచరీతో అలరించగా, శ్రేయస్ అయ్యర్ (56 పరుగులు) రాణించాడు.



## ఫైనల్ చేరిన జైస్మిన్, నుపుర్

వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జైస్మీన్ లాంబోరియా, నుపుర్ షెరాన్ దుమ్మురేపారు. అద్వితీయమైన ప్రదర్శనతో ఫైనల్ దూసుకెళ్లి బంగారు పతకానికి అడుగు దూరంలో నిలిచారు. శుక్రవారం జరిగిన మహిళల 57 కేజీల సెమీఫైనల్లో జైస్మీన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా(వెనిజువెలా)ను ఓడించింది. ఫైనల్లో ఆమె పారిస్ ఒలింపిక్స్ సిల్వర్ మెడలిస్ట్ జులియా(పోలెండ్)తో తలపడనుంది. 80 కేజీల విభాగంలో జరిగిన సెమీఫైనల్లో నుపుర్ షెరాన్ 5-0తో దుజ్గన్ సెమ(తుర్కియే)ను చిత్తు చేసింది. మ్యాచ్ ఆరంభం నుంచి వ్యూహాత్మకంగా ఆడిన నుపుర్ ప్రత్యర్థిపై క్రమం తప్పకుండా పంచ్‌లు విసిరి.. ఆధిపత్యం చెలాయించింది. మరోవైపు మీనాక్షి హుడా స్ఫూర్తిదాయక ప్రదర్శనతో సెమీఫైనల్ చేరి పతకాన్ని ఖాయం చేసింది. 48 కేజీల క్వార్టర్ ఫైనల్లో అండర్ 19 ప్రపంచ ఛాంపియన్ అలిస్ పామ్‌ఫెరి(ఇంగ్లండ్)ను మీనాక్షి చిత్తు చేసింది. ఈ బౌట్లో తన ఎత్తును అడ్వాంటేజ్‌గా మార్చుకుంది. బ్యాక్‌ఫుట్‌పై ఉంటూ ప్రత్యర్థిపై దాడి చేసింది. బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి పంచ్‌లను కాచుకుని విజయాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో స్థానం కోసం అల్టాంట్(మంగోలియా)తో భారత బాక్సర్ అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు పురుషుల్లో జాదుమణి సింగ్ పోరాటం క్వార్టర్స్‌లోని ముగిసింది. 50 కేజీల క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఛాంపియన్ సాన్ జార్(కజకిస్తాన్) చేతిలో జాదుమణి ఓటమిపాలయ్యాడు. దాంతో పురుషుల్లో భారత్ పోరాటం ముగిసింది. 2013 తర్వాత పురుషుల విభాగంలో భారత్ ఒక్క పతకం కూడా సాధించకపోవడం ఇదే తొలిసారి.

## బీసీసీఐ అధ్యక్షుడిగా ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ..?




భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీ బాధ్యతలు చేపట్టనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుత బీసీసీఐ అధ్యక్షుడిగా ఉన్న రోజర్ బిన్నీ పదవి కాలం త్వరలో ముగియనుంది. దాంతో కొత్త అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన ప్రక్రియను బీసీసీఐ చేపట్టింది. మరో రెండు వారాల్లో బీసీసీఐ సర్వసభ్య సమావేశం జరగనుంది.ఈ సమావేశంలోనే ఎలాంటి ఎన్నిక లేకుండా ఏకగ్రీవంగా అధ్యక్షుడిని ఎన్నుకోవాలని బీసీసీఐ భావిస్తోంది. ఇందుకోసం రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్స్ మద్దతు తెలిపేలా బీసీసీఐ చర్యలు చేపట్టింది. సెప్టెంబర్ 28న బీసీసీఐ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. బీసీసీఐ ప్రెసిడెంట్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవులను భర్తీ చేయనుంది.సౌరవ్ గంగూలీ అనంతరం 2022లో బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రోజర్ బిన్నీ మూడేళ్ల పదవికాలం త్వరలో ముగియనుంది. ప్రస్తుతం బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా ఉన్నారు. బీసీసీఐ నయా అధ్యక్షుడి రేసులో క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ ఉన్నారని కూడా ప్రచారం జరిగింది. కానీ ఈ వార్తలను సచిన్ కార్యాలయం ఖండించింది. బీసీసీఐలో ఏ పదవి చేపట్టేందుకు సచిన్ టెండూల్కర్ ఆసక్తి లేదని స్పష్టం చేసింది.అయితే బీసీసీఐ అధ్యక్షుడి రేసులో టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కూడా ఉన్నట్లు అర్థమవుతోంది. సెప్టెంబర్ 28న బీసీసీఐ నిర్వహించే వార్షిక సర్వసభ్య సమావేశంలో పంజాబ్ క్రికెట్ అసోసియేషన్(పీసీఏ) తమ ప్రతినిధిగా హర్భజన్ సింగ్‌ను నామినేట్ చేయడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. ప్రస్తుతం హర్భజన్ సింగ్ ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022లో భజ్జీని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభకు నామినేట్ చేసింది.ఒకవేళ హర్భజన్ సింగ్ బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికైతే.. సౌరవ్ గంగూలీ, రోజర్ బిన్నీ తర్వాత మరో వరల్డ్ కప్ విజేతకు ఈ అవకాశం వచ్చినట్లు అవుతుంది. హర్భజన్ సింగ్ టీమిండియా గెలిచిన 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ గెలిచి జట్లలో సభ్యుడు.హర్భజన్ సింగ్‌తో పాటు బీసీసీఐ అధ్యక్షుడి రేసులో మాజీ క్రికెటర్, 63 ఏళ్ల కిరణ్ మోరె కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వెస్ట్ జోన్‌కు చెందిన వారికి ఈ సారి అధ్యక్షుడిగా అవకాశం దక్కనున్నట్లు ప్రచారం జరుగుతుంది. కిరణ్ మోరె సౌరాష్ట్రకు చెందిన మాజీ క్రికెటర్. రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఆయన సెలెక్షన్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించాడు. 2019లో యూఏస్ క్రికెట్‌కు తాత్కలిక కోచ్‌గా, డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. అయితే బీసీసీఐ అధ్యక్షుడి రేసులో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఉన్నట్లు వార్తలు వచ్చాయి. బోర్డు సభ్యులు కూడా సచిన్ టెండూల్కర్ పట్ల ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరిగింది. కానీ ఈ వార్తలను సచిన్ టెండూల్కర్ కార్యాలయం ఖండించింది. ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొంది. బీసీసీఐలో ఏ పదవి చేపట్టేందుకు సచిన్ టెండూల్కర్ ఆసక్తిగా లేరని స్పష్టం చేసింది. ఈ మేరకు సచిన్ టెండూల్కర్‌కు చెందిన ఎస్ఆర్‌టీ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ గురువారం ఓ ప్రకటనను విడుదల చేసింది.’బీసీసీఐ అధ్యక్ష పదవి రేసులో సచిన్ టెండూల్కర్ ఉన్నారని, నామినేట్ అయ్యారని జరుగుతున్న ప్రచారం మా దృష్టికి వచ్చింది. అయితే ఇందులో ఏ మాత్రం నిజం లేదు. బీసీసీఐలోని ఏ పదవిపై సచిన్ టెండూల్కర్‌కు ఆసక్తి లేదు. నిరాధారమైన ఊహాగానాలకు ప్రాధాన్యత ఇవ్వద్దని అందర్నీ కోరుతున్నాం.’అని ఆ ప్రకటనలో పేర్కొంది.సెప్టెంబర్ 28న బీసీసీఐ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనుంది. బీసీసీఐ ప్రెసిడెంట్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పదవులను భర్తీ చేయనుంది. సౌరవ్ గంగూలీ అనంతరం 2022లో బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రోజర్ బిన్నీ మూడేళ్ల పదవికాలం త్వరలో ముగియనుంది. ప్రస్తుతం బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా ఉన్నారు. భారత క్రికెట్ ముఖచిత్రంగా ఎదిగిన సచిన్ టెండూల్కర్.. వరల్డ్ బెస్ట్ బ్యాటర్‌గా గుర్తింపు పొందారు. రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో సచిన్ 200 టెస్టులు ఆడి 15921 పరుగులు చేశాడు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. 463 వన్డేల్లో 18426 పరుగులు చేసిన సచిన్.. ఒకే ఒక్క టీ20లో 10 పరుగులు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా కూడా రికార్డ్ అందుకున్నాడు. 2015-19 మధ్య బీసీసీఐ క్రికెట్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా సచిన్ సేవలందించాడు.

# మిరాయ్ తొలిరోజు 27 కోట్లు వసూలు

## చిత్ర విజయంతో...హీరో తేజ సజ్జా ఆనందం




యంగ్ హీరో తేజ సజ్జా , మంచు మనోజ్ కీలక పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిరాయ్'. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా వాటిని అందుకోవడంలో విజయం సాధించింది. తాజాగా నిర్మాణసంస్థ అధికారికంగా దీని వసూళ్లను వెల్లడించింది.తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.27.20 కోట్లు- వసూలుచేసినట్లు- తెలిపింది. దీనిపై హీరో తేజ సజ్జా స్పందిస్తూ.. 'మీ ప్రేమకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇదే చరిత్ర, ఇదే భవిష్యత్తు, ఇదే మిరాయ్' అని ఆనందం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగానే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'మిరాయ్'కు మంచి స్పందన లభిస్తోంది. మొదటిరోజు విదేశాల్లో రూ.7లక్షల డాలర్లు వసూలుచేసినట్లు- నిర్మాణ సంస్థ పేర్కొంది. దీని వీఎఫ్ఎక్స్ వర్క్‌పై నెట్టింట ప్రశంసలు వస్తున్నాయి. ప్రముఖులు కూడా దీనిపై పోస్ట్ పెడుతున్నారు. దీనిపై నిర్మాత విశ్వప్రసాద్ ఆనందం వ్యక్తంచేశారు. ఎంతో అద్భుతంగా దీన్ని తీర్చిదిద్దారని.. ఫ్రేమ్ టూ ఫ్రేమ్ చెక్ చేసినా బ్లర్ లేకుండా స్పష్టంగా కనిపిస్తున్నాయని సోషల్ మీడియా వేదికగా వీఎఫ్ఎక్స్ టీమ్‌ను ప్రశంసించారు.'హను-మాన్'తో భారీ విజయాన్ని అందుకున్న తేజ ఆ చిత్రం తర్వాత ఎన్ని ఆఫర్లు వచ్చినప్పటికీ 'మిరాయ్' కోసం వాటన్నిటినీ వదులుకున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో వచ్చిన ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ఈ హీరో సూపర్ యోధాగా కనిపించి మెప్పిస్తున్నారు. మహావీర్ లామా పాత్రలో మంచు మనోజ్ కూడా ఆకట్టుకుంటున్నారు. ఒక మామూలు కుర్రాడు తన ధర్మాన్ని తెలుసుకొని, ఒక పెద్ద ఆపదని ఆపడానికి ఎంత దూరం వెళ్తాడు? తన తల్లి ఆశయం కోసం ఏం చేశాడు? ఇతిహాసాల్లో ఉన్న సమాధానం కోసం అతడు చేసే ప్రయాణం ఏంటి అనే కథాంశంతో మిరాయ్ రూపొందింది.

# మిరాయ్ విజయంతో మనోజ్ ఆనందం

## తల్లి ఆశీర్వాదం తీసుకుని సెలబ్రేషన్స్



తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం 'మిరాయ్' సినిమా విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సక్సెస్‌ను కుటుంబం, స్నేహితులతో కలిసి మనోజ్ పండగ చేసుకున్నారు. తన తల్లి పాదాలకు నమస్కారం చేసి ఎమోషనల్ అయ్యారు. ఈ విజయం చూసి ఆమె భావోద్వేగానికి గురయ్యారని.. అందరికంటే గర్వంగా ఫీలయ్యారని మనోజ్ వీడియో షేర్ చేశారు. తనను ఆదరించిన అభిమానులకు ధన్యవాదాలు చెప్పారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో కనిపించిన ఈ చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. అందులో మనోజ్ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. తనను నమ్మిన దర్శక నిర్మాతలకు రుణపడి ఉంటానన్నారు. ఈరోజు ఎంతో ఆనందంగా ఉంది. 12 ఏళ్ల తర్వాత సక్సెస్‌తో నా ఫోన్ మోగుతూనే ఉంది. అభినందనలు వస్తున్నప్పటికీ నాకు ఇదంతా కలలా ఉంది. ఈ కథలో నన్ను భాగం చేసినందుకు కార్తిక్‌కు జన్మంతా రుణపడి ఉంటాను. ఇంతకుముందు నేను ఎక్కడికి వెళ్లినా 'అన్నా సినిమా ఎప్పుడు తీస్తావు. కమ్‌బ్యాక్ ఎప్పుడు?' అని అందరూ అడిగేవారు. త్వరలోనే వస్తాను అని చెప్పేవాడిని. వాళ్లతో బయటకు ధైర్యంగా మాట్లాడినా.. లోపల తెలియని భయం ఉండేది. చాలా సినిమాలు చివరి నిమిషంలో క్యాన్సిల్ అయ్యాయి. అలాంటి టైమ్‌లో కార్తిక్ నన్ను నమ్మడం నా అదృష్టం. మీరు నన్ను మాత్రమే నిలబెట్టలేదు.. నాతో పాటు నా కుటుంబాన్ని కూడా నిలబెట్టారని దర్శకుడు కార్తిక్‌కు మంచు మనోజ్ థాంక్స్ చెప్పారు. నిర్మాత కూడా ఎంతో ధైర్యంగా దీన్ని పూర్తిచేశారు. 'మనోజ్‌తో సినిమా వద్దు' అని ఆయనకు ఎంతోమంది చెప్పి ఉంటారు. అవేవీ వినకుండా విశ్వప్రసాద్ దీన్ని నిర్మించారు. 'మిరాయ్' వీఎఫ్ఎక్స్ టీమ్ తెలుగు సినిమా గర్వపడేలా చేసింది. ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి. ప్రతి ఇంట్లో నుంచి మనోజ్ గెలవాలి అని కోరుకున్న వారందరికీ పేరుపేరునా పాదాభివందనం. నామీద నమ్మకం పెట్టుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు. ఇకపై వరుస సినిమాలు చేస్తూ మీ అందరినీ అలరిస్తాను అని మనోజ్ తెలిపారు. ఇక మిరాయ్‌లో మహావీర్ లామా పాత్రలో మనోజ్ అందరినీ ఆకట్టుకుంటున్నారు.

# మహావతార్‌లో డీలిటెడ్ సీన్స్ విడుదల

చిన్న యానిమేటెడ్ సినిమాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది 'మహావతార్ నరసింహ'. ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి 50 రోజులైన సందర్భంగా నిర్మాణ సంస్థ డిలీటెడ్ సీన్ వీడియోను పంచుకుంది. 50 రోజులైనా ఇంకా 200కు పైగా థియేటర్‌లలో ఈ సినిమా ఆడుతోందని తెలిపింది. ఇప్పటి వరకూ 'మహావతార్ నరసింహ' రూ.300కోట్లు- వసూళ్లు చేసిన విషయం తెలిసిందే.




## హోమ్‌బౌండ్ హీరో

# మంచి నటుడు

## హీరోయిన్ జాన్వీ కపూర్ కితాబు

జాన్వీకపూర్, ఇషాన్ ఖట్టర్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'హోమ్‌బౌండ్' విడుదలకు ముందే ఎన్నో ఘనతలు సొంతం చేసుకుందీ చిత్రం. తాజాగా దీని గురించి జాన్వీకపూర్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇషాన్ ఖట్టర్‌పై ప్రశంసలు కురిపించారు. ఇది గొప్ప కథ. అందుకే ఈ చిత్రం నా కెరీర్‌కు ఉపయోగ పడుతుందా.. లేదా అని ఆలోచించకుండానే అంగీకరించాను. 'హోమ్‌బౌండ్' చిత్రీకరిస్తున్నప్పుడు ప్రతి సన్నివేశంపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. దీన్ని కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించినప్పుడు వచ్చిన ఆదరణ చూశాక ఆశ్చర్యపోయాం. ఇది ప్రేక్షకులపై ఎంత ప్రభావం చూపిందో మాకు అర్థమైంది. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈ సినిమా చేసినందుకు ప్రేక్షకులు నన్ను ట్రోల్ చేస్తారేమో అనే భావన నాకెప్పుడూ రాలేదని జాన్వీకపూర్ అన్నారు. ఇక కేన్స్‌లో ఈ చిత్రానికి లభించిన స్పందన గురించి జాన్వీ మాట్లాడుతూ చిత్రబృందంలోని ప్రతిఒక్కరూ అంతర్జాతీయ గుర్తింపునకు అర్హులని అన్నారు. ఇందులో ప్రధానపాత్రలో నటించిన ఇషాన్ దేశంలోని ప్రతిభావంతులైన నటులలో ఒకడు. కానీ, అతడికి భారతీయ సినిమాలో ఇప్పటి వరకూ సరైన గుర్తింపు రాలేదు. కేన్స్ వేదికపై ఇషాన్‌ను చూడడం, ప్రపంచం అతడి నటనను ప్రశంసించడం చూసి నేనెంతో ఆనందించా. కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని అర్థమైందని చెప్పారు. ఇద్దరు స్నేహితుల మధ్య అనుబంధం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'హోమ్‌బౌండ్'. ప్రముఖ దర్శకుడు నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్, విశాల్ జెత్వా కీలక పాత్రలు పోషించారు. కేన్స్‌లో ప్రదర్శితమై విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఈ సినిమా ఇటీ-వల 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్'(ఐఎఫ్ఎఫ్ఎం)లో ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడిగా నీరజ్ ఘైవాన్ పురస్కారాన్ని సొంతం చేసుకున్నారు.





# రెండోపెళ్లికి సిద్ధంగా ఉన్న నటి ఎస్తేర్

ఇప్పటి వరకు ఒకే పెళ్లితో జీవితం గడిపేయాల్సిన సమాజపు ఆలోచన మారిపోయింది. విడాకులు తీసుకున్న, జీవిత భాగస్వామి లేకపోయినా, కొత్త జీవితం కోసం మరోసారి పెళ్లి చేసుకోవడమే ఇప్పుడు సాధారణంగా మారింది. సామాన్యులే కాదు, సినీ ప్రపంచంలోనూ ఈ ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. సింగర్ సునీత నుంచి అక్కినేని నాగచైతన్య వరకు చాలామంది రెండో పెళ్లి చేసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. అలాంటిది తాజాగా ఈ జాబితాలో చేరబోతున్నారంటూ వార్తల్లో నిలుస్తున్నారు హీరోయిన్ ఎస్తేర్ నొరోన్హా. కర్ణాటకలోని ఉడిపి కి చెందిన ఎస్తేర్, ముంబైలో చదువుకున్నారు. బాలనటిగా కొంకణి సినిమాల్లో నటించి, ఆ తర్వాత 2012లో బారొమాస్ అనే హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా అడుగుపెట్టారు. తెలుగులో పూరి జగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన వేయి అబద్ధాలు సినిమాతో ఎంట్రీ- ఇచ్చి, భీమవరం బుల్లోడు, గరం, జయ జానకి నాయక, ఐరావతం, 69 సంస్కార్ కాలనీ, చెంగురే బంగారు రాజా, డెవిల్, -టెనెంట్, థలా వంటి సినిమాల్లో నటిస్తూ తనకంటూ గుర్తింపు సంపాదించుకుంది. సినిమాల విషయం పక్కన పెడితే.. వ్యక్తిగత జీవిత విషయంలో మాత్రం తరచూ వార్తల్లో నిలిచింది. కారణం సింగర్ నోయెల్.. అతని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె, ఏడాదిలోనే మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. అయితే ఈ మధ్యకాలంలో ఎస్తేర్ రెండో పెళ్లి చేసుకోబోతున్నారంటూ గాసిప్స్ వినిపించాయి. తాజాగా వాటిని నిజం చేస్తూనే ఓ బిగ్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేలా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. జీవితంలో మరో అందమైన సంవత్సరం.. అవకాశాలు, అద్భుతాలను ఇచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు. పుట్టినరోజు సందర్భంగా మీ ప్రేమ, ఆశీర్వాదాలకు ధన్యవాదాలు. త్వరలోనే మీతో ఓ స్పెషల్ అనౌన్స్‌మెంట్ పంచుకుంటాను. వేచి ఉండండి' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో ఎస్తేర్ నిజంగానే రెండో పెళ్లి చేసుకోబోతుందా అనే వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685